


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 191 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : ఎన్.టి.ఆర్ జిల్లా | బుధవారం 22 జూలై 2026 | వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 191 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : NTR DIST, | WED 22 JULY 2026 | PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur



## షూటింగ్‌లో బాలకృష్ణకు స్వల్ప గాయం

- కాకినాడ పోర్ట్ పరిసరాల్లో 'NBK111' షూటింగ్
- యాక్షన్ సీన్ చిత్రీకరిస్తుండగా కాలుజారి కిందపడ్డ బాలయ్య
- గాయం స్వల్పమైనదేనని ప్రకటించిన వైద్యులు

- మిగతా 2లో



సనాతన ధర్మం గురించి మాట్లాడే కూటమి

## నేతలు ఇక్కడకు వచ్చి అక్రమ మైనింగ్ చూడాలి

- యలమంచిలి నియోజకవర్గంలో పంచదార్ల కొండపై కూటమి నేతలు అక్రమ మైనింగ్ చేస్తున్నారన్న బొత్స
- కొండల రక్షణ కోసం తాము ధర్మ పోరాటం చేస్తున్నామని వెల్లడి
- స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే ఇద్దరూ కలిసి దోపిడీ చేస్తున్నారని ఆరోపణ

2లో






ప్రధాని మోదీ నివాసం వద్ద

# హైడ్రామా..

## రాహుల్ గాంధీ, ప్రియాంకలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

- నీట్ వివాదం, విద్యార్థులపై లాఠీచార్జి అంశాలపై మోదీ నివాసం వద్ద కాంగ్రెస్ నిరసన
- రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- విద్యాశాఖ మంత్రి రాజీనామాకు పట్టుబట్టడంతో విఫలమైన చర్చలు
- అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్
- ఢిల్లీలో కొనసాగుతున్న రాజకీయ ఉద్రిక్తత

- మిగతా 2లో

నీట్ పరీక్షల వివాదం, విద్యార్థులపై లాఠీచార్జి అంశాలు దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర రాజకీయ ఉద్రిక్తతకు దారితీశాయి. ప్రధాని నరేంద్ర మోదీ నివాసాన్ని ముట్టడించేందుకు యత్నించిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలను ఢిల్లీ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు పలువురు సీనియర్ నేతలు, ఎంపీలను కూడా నిర్బంధంలోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు.




# ఏపీలో యూఏఈ ఫుడ్ క్లస్టర్..

## దావోస్ ఒప్పందానికి కీలక ముందడుగు

- దావోస్‌లో కుదిరిన ఒప్పందానికి కార్యరూపం
- ముఖ్యమంత్రి చంద్రబాబుతో యూఏఈ ఆర్థిక మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ భేటీ
- మామిడి, అరటి వంటి ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ కల్పనే లక్ష్యం
- ఏపీ ప్రభుత్వం, యూఏఈ మధ్య కుదిరిన కీలక భాగస్వామ్యం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ దిశగా కీలక పరిణా మం చోటుచేసుకుంది. ఈ ఏడాది దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో కుదిరిన మరో కీలక ఒప్పందం కార్యరూపం దాల్చే దిశగా ముందడుగు పడింది. రాష్ట్రం లో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు యునైటె డ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఈ మేరకు మంగళ వారం రాష్ట్ర సచివాల యంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం భేటీ అయింది. ఈ ఏడాది దావోస్ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిపిన చర్చల సందర్భంగా ఏపీలో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు యూఏఈ సంసిద్ధత వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఆ ఒప్పందాన్ని ఆచరణలోకి తీసుకురావ



డంలో భాగంగా యూఏఈ ప్రతినిధులు అమరావతికి వచ్చారు. ఆహార శుద్ధి రంగంలో ఆంధ్రప్రదేశ్‌లో ఒక పూర్తిస్థాయి వ్యాల్యూచైన్ ఏర్పాటు చేయాలని యూఏఈ నిర్ణయించింది. దీనికోసం ఏపీ ప్రభుత్వం, యూఏఈ మధ్య అధికారికంగా భాగస్వామ్యం కుదిరింది. ఈ భాగస్వామ్యం ద్వారా రాష్ట్రంలో అధికంగా పండే మామిడి, అరటి, కోకో వంటి ఉద్యాన ఉత్పత్తులను శుద్ధి చేసి, నాణ్యతా ప్రమాణాలతో ప్యాక్ చేసి, అంతర్జాతీయ మార్కెట్లకు తరలించేందుకు అవసరమైన వ్యవస్థను ఏర్పాటు చేయను న్నారు. ఇది రాష్ట్రంలోని రైతులకు మేలు చేయడంతో పాటు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఉపాధి అవకాశాలను మెరుగుపరు స్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కీలక సమావేశంలో యూఏఈ ప్రతినిధులతో పాటు రాష్ట్ర మంత్రి టీజీ భరత్, ఫుడ్ ప్రాసె సింగ్, పరిశ్రమల శాఖల ఉన్నతాధికారులు, ఏపీ ఎకనామిక్ డెవలప్ మెంట్ బోర్డు (ఈడీబీ) అధికారులు పాల్గొన్నారు.



## 2021 నాటికే పూర్తి కావాల్సిన పోలవరాన్ని వైసీపీ నాశనం చేసింది

### నిమ్మల రామానాయుడు

- వైసీపీ పాలనలో పోలవరం ప్రాజెక్టు తీవ్రంగా నష్టపోయిందన్న నిమ్మల
- నిర్వాసితులను కూడా గత ప్రభుత్వం మోసం చేసిందని విమర్శ
- ఇప్పుడిప్పుడే రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు బాగుపడుతున్నాయని వ్యాఖ్య

- మిగతా 2లో



మంగళగిరిలో నారా లోకేశ్

## 7.30 గంటల నాన్ స్టాప్ 'పట్టా'భిషేకం

- మంగళగిరిలో 1331 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ
- 'మన ఇల్లు - మన లోకేశ్' కార్యక్రమానికి శ్రీకారం
- సుమారు 7.30 గంటల పాటు నిలబడే పట్టాలు అందించిన మంత్రి లోకేశ్
- లబ్ధిదారులకు పట్టాతో పాటు నూతన వస్త్రాలు బహూకరణ

- మిగతా 2లో

## రాహుల్ గాంధీ మాట మార్చారు



### కేంద్రమంత్రి జితేంద్ర సింగ్

- నీట్‌పై చర్చ విషయంలో రాహుల్ గాంధీ మాట మార్చారని కేంద్రం ఆరోపణ
- ప్రధాని నివాసం సమీపంలో కాంగ్రెస్ నిరసన.. పాల్గొన్న రాహుల్, ప్రియాంక
- ధర్నా వద్దకు వెళ్లి రాహుల్‌తో మాట్లాడిన కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్
- మంత్రుల రాజీనామాకు కాంగ్రెస్ డిమాండ్.. చర్చలు విఫలమయ్యాయని ప్రకటన

- మిగతా 2లో

## భర్తల ఉద్యోగాలు ఊడేలా భార్యల ఫిర్యాదులు

### సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన



- భర్తలు పనిచేసే సంస్థలకు కొందరు భార్యలు ఫిర్యాదు చేస్తున్నారన్న సుప్రీంకోర్టు
- దీని వల్ల భర్తలు ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉందని వ్యాఖ్య
- జీవిత భాగస్వామి జీవనోపాధిని దెబ్బతీయడం తీవ్రమైన అంశమన్న సుప్రీంకోర్టు

- మిగతా 2లో

# ఎడిటర్ వ్యూ

## భర్తల ఉద్యోగాలు ఊడేలా భార్యల ఫిర్యాదులు సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన

వైవాహిక వివాదాల నేపథ్యంలో కొందరు మహిళలు తమ భర్తలు పనిచేసే సంస్థలకు ఫిర్యాదులు చేస్తూ, వారి జీవనోపాధి దెబ్బతినేలా ప్రవర్తించడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి ఫిర్యాదుల వల్ల భర్తలు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని, అది చివరికి భార్యలకు అందే భరణం (జీవనభృతి)పై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని అత్యున్నత కోర్టు స్పష్టం చేసింది. అసోంలో నమోదైన ఒక పరువునష్టం కేసును ఉత్తర్ ప్రదేశ్‌కు బదిలీ చేయాలని కోరుతూ ఒక మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్. మహాదేవన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ విచారణ సందర్భంగా జస్టిస్ నాగరత్న వ్యాఖ్యానిస్తూ.. "ఇటీవలి కాలంలో వివాహ సంబంధిత గొడవల వల్ల భర్తలు పనిచేసే కంపెనీలు లేదా సంస్థలకు భార్యలు ఫిర్యాదు చేయడం ఒక ధోరణిగా మారింది. విడాకులు కోరడం వేరు. కానీ జీవిత భాగస్వామి జీవనోపాధినే దెబ్బతీయడం అత్యంత తీవ్రమైన అంశం" అని అభిప్రాయపడ్డారు. ఈ కేసులో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారైన తన భర్త సేవా నియమాలకు విరుద్ధంగా వ్యక్తిగత వ్యాపారం నడుపుతున్నాడంటూ సదరు మహిళ ఎయిర్‌ఫోర్స్ అధికారులకు ఫిర్యాదు చేయగా, ఆమెపై భర్త స్నేహితుడు పరువునష్టం కేసు దాఖలు చేశారు. ఇరువైపులా వాదనలు విన్న సుప్రీంకోర్టు, ఈ వివాదంలో సామరస్యపూరిత పరిష్కారానికి అవకాశం ఉందేమో పరిశీలించేందుకు కేసును మధ్యవర్తిత్వ కేంద్రానికి పంపింది. పరస్పర ఆరోపణలన్నీ విరమించుకుని సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని మహిళకు అత్యున్నత కోర్టు సూచించింది.

## 2021 నాటికే పూర్తి కావాల్సిన పోలవరాన్ని వైసీపీ నాశనం చేసింది

2019లో తెలుగుదేశం ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 నాటికే పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేదని... కానీ గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల విధ్వంస పాలన వల్ల ప్రాజెక్టు తీవ్రంగా నష్టపోయిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇప్పుడిప్పుడే రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు గాడిన పడుతున్నాయని పేర్కొన్నారు. సచివాలయంలో జలవనరుల శాఖపై ఈరోజు ఆయన శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కీలకమైన ప్రాజెక్టులు, వాటి తాజా స్థితిగతులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలు వెల్లడించారు. 2014-19 మధ్యకాలంలో పోలవరం పనులు వేగంగా జరిగి 72 శాతం మేర పూర్తయ్యాయని, అయితే జగన్ 'ఒక్క ఛాన్స్' అంటూ వచ్చి రివర్స్ టెండరింగ్ పేరుతో తీవ్ర నష్టం చేశారని విమర్శించారు. కాంట్రాక్టు ఏజెన్సీలను రద్దు చేయవద్దని ఎంతమంది హెచ్చరించినా వినకుండా, 17 నెలల పాటు పనులను నిలిపివేశారని మండిపడ్డారు. దీని ఫలితంగానే 2020లో వచ్చిన వరదలకు డయాఫ్రమ్‌వాల్ పూర్తిగా దెబ్బతిన్నదని నిపుణులు స్పష్టం చేశారని తెలిపారు. ఆఖరికి పోలవరం నిర్వాసితులను కూడా గత ప్రభుత్వం మోసం చేసిందని దుయ్యబట్టారు. ధ్వంసమైన జలవనరుల రంగాన్ని పునర్నిర్మించి పూర్వ స్థితికి తీసుకువస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. 2028 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో 36 ప్రధాన ప్రాజెక్టులను ఏ స్థాయిలో పూర్తి చేస్తామనే దానిపై స్పష్టమైన కార్యాచరణను వివరించారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి జిల్లాకు తాగు, సాగు నీటిని సరఫరా చేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.

## షూటింగ్‌లో బాలకృష్ణకు స్వల్ప గాయం

నటసింహం, స్టార్ హీరో నందమూరి బాలకృష్ణ కాకినాడ పోర్ట్ ప్రాంగణంలో జరుగుతున్న తన తాజా చిత్రం 'NBK111' షూటింగ్‌లో ప్రమాదానికి గురయ్యారు. డైరెక్టర్ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ కోసం కాకినాడ పోర్ట్ పరిసర ప్రాంతాల్లో కొన్ని కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మంచు మనోజ్‌తో కలిసి ఒక హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్న సమయంలో బాలకృష్ణ అనుకోకుండా కాలుజారి కిందపడటంతో ఆయన మోకాలికి స్వల్ప గాయమైంది. ఈ ప్రమాదం జరిగిన వెంటనే చిత్ర యూనిట్ సభ్యులు షూటింగ్‌ను అక్కడికక్కడే నిలిపివేసి, ఆయనను తక్షణ చికిత్స కోసం సమీపంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలోని వైద్యుల బృందం బాలకృష్ణకు ప్రాథమిక చికిత్స అందించడంతో పాటు అవసరమైన ఇతర వైద్య పరీక్షలను పూర్తి చేసింది. ఈ గాయం చాలా స్వల్పమైనదేనని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు స్పష్టం చేశారు. అయితే, త్వరగా కోలుకోవడానికి కొన్ని రోజుల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని ఆయనకు వైద్యులు సూచించారు. 'వీరసింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ విజయం తర్వాత బాలకృష్ణ - గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వస్తున్న రెండవ చిత్రం కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. కాకినాడ షెడ్యూల్‌లో రిస్కీ యాక్షన్ దృశ్యాలను తెరకెక్కిస్తున్న సమయంలో ఈ అనుకోని సంఘటన జరిగిందనే వార్త సోషల్ మీడియాలో వ్యాపించడంతో అభిమానులు, సినీ ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి పూర్తిగా స్థిరంగా ఉందని, ఆసుపత్రి నుంచి త్వరలోనే డిశ్చార్జ్ అయి తిరిగి కోలుకుంటారని సమాచారం.


## సనాతన ధర్మం గురించి మాట్లాడే కూటమి నేతలు ఇక్కడకు వచ్చి అక్రమ మైనింగ్ చూడాలి

అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గం, రాంబిల్లి మండలంలోని పంచదార్ల గ్రామంలో ఉన్న ఫణిగిరి కొండపై కూటమి నేతలు అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారంటూ వైసీపీ నేతలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. 'ఛలో పంచదార్ల' పేరిట భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు భారీ ర్యాలీగా తరలివచ్చి పంచదార్ల కొండలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, రీజనల్ కోఆర్డినేటర్లు కురసాల కన్నబాబు, బూడి ముత్యాలనాయుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ... పంచదార్ల కొండల రక్షణ కోసం తాము ధర్మ పోరాటం చేస్తున్నామని స్పష్టం చేశారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే ఇద్దరూ కలిసి ఈ కొండలను దారుణంగా దోపిడీ చేస్తున్నారని, ఇది చిన్న చిన్న వ్యక్తులు చేస్తున్న అక్రమ మైనింగ్ కాదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "నిత్యం సనాతన ధర్మం గురించి మాట్లాడే కూటమి పెద్దలకు కళ్లు ఉంటే ఇక్కడ జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను వచ్చి చూడాలి. ఈ ధర్మ పోరాటం ప్రజా ఉద్యమంలా మారకముందే జిల్లా కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు. పంచదార్ల కొండల దోపిడీపై తాము ప్రశ్నిస్తుంటే కూటమి నేతలు ఇందులో ఏదో కుట్ర దాగి ఉందని అనడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. పవిత్రమైన కొండలను దోచుకుంటున్న కూటమి నేతలకు ఆ దేవుడి పాపం తప్పక తగులుతుందని, శివుడు మూడో కన్ను తెరిస్తే ఏమవుతుందో గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. రేపటి కల్లా పంచదార్ల కొండపై మైనింగ్ వాహనాలు కనిపిస్తే అక్రమ మైనింగ్ ఆపే వరకు నడిరోడ్డుపైనే ధర్నాలు చేస్తామని, ఎంతటి పోరాటానికైనా వెనుకాడేది లేదని బొత్స స్పష్టం చేశారు.

# ఆ సబ్ రిజిస్ట్రార్ రూటే సెపరేటు..!

### అయ్యవారి బాగోతాలు - 4

- అద్దెకు ఇల్లు ఇచ్చాడు.. చివరకు శవమై మిగిలాడు..!
- నిడదవోలు అద్దె ఇంటి నుంచి మొదలైన వివాదం.. భీమడోలు వరకు సాగుతున్న ఆరోపణల నీడ
- పత్రాలు ఎక్కడ..? కలప సామగ్రి ఏమైంది..?
- ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని ఒత్తిళ్లు వచ్చాయా..?
- "ఏం చేయాలో అదే చేస్తా" అన్న బెదిరింపుల వెనుక నిజమెంత..?
- ఇంటి యజమాని మృతి.. మిస్టరీగా మిగిలిన ప్రశ్నలు
- ఆ మరణంపై సమగ్ర విచారణ జరిగితే.. మరిన్ని నిజాలు వెలుగులోకి వస్తాయి..?
- లంచం లేకుండా రిజిస్ట్రేషన్లు జరగవన్న ఆరోపణలు.. సమగ్ర దర్యాప్తుకు బాధిత ప్రజల డిమాండ్




**అద్దెకు ఇల్లు ఇచ్చాడు. ప్రభుత్వ అధికారి కాబట్టి పర్వాలేదనుకున్నాడు. తన ఇంట్లోకి వచ్చిన వ్యక్తిని నమ్మాడు. తన పొలం పత్రాలు రిజిస్ట్రేషన్ కోసం ఇచ్చాడు , కానీ ఆ నమ్మకమే చివరకు తన కుటుంబానికి కన్నీటి కథగా మిగిలిందా..? ఇంటి నుంచి విలువైన కలప సామగ్రి మాయమైందని ఆరోపణలు. భూమికి సంబంధించిన కీలక పత్రాలు తీసుకెళ్లి తిరిగి ఇవ్వలేదన్న వాదనలు. దీనిపై అధికారులను ఆశ్రయించినా స్పందన లేదన్న ఆవేదన. ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని ఒత్తిళ్లు వచ్చాయన్న ఆరోపణలు. "కేసు వెనక్కి తీసుకోకపోతే ఏం చేయాలో అదే చేస్తా" అన్నట్లుగా బెదిరింపులు ఎదురయ్యాయన్న బాధిత కుటుంబం వాంగ్మూలం. ఆ తర్వాత.. ఇంటి యజమాని మృతి. ఇది సాధారణ మరణమా..? లేక తీవ్ర ఒత్తిళ్లు, బెదిరింపులు, అవమానాలు, న్యాయం కోసం చేసిన పోరాటం మధ్య చోటుచేసుకున్న అనుమానాస్పద మరణమా..? ఇదే ఇప్పుడు అందరికీ మిస్టరీగా మారిన ప్రశ్న.**

**ఎడిటర్ పెన్ పవర్ ఏలూరు/భీమడోలు, జూలై 21:**



వివరాల్లోకి వెళితే పశ్చిమ గోదావరి జిల్లా భీమడోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వాసిరెడ్డి రాఘవేంద్ర ప్రసాద్‌పై సంచలన ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. గతంలో వేగేశ్వరపురం సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన సమయంలో నిడదవోలులోని అద్దె ఇంటిలో జరిగినట్లు చెబుతున్న వివాదం ఇప్పుడు మరోసారి తెరపైకి వచ్చింది. వివాహేతర సంబంధం, ఇంటి సామగ్రి చోరీ, భూమి పత్రాలు తీసుకెళ్లి తిరిగి ఇవ్వకపోవడం, ఫిర్యాదులు వెనక్కి తీసుకోవాలని బెదిరింపులు, అవినీతి ఆరోపణలు వంటి పలు అంశాలను ఇంటి యజమాని కుటుంబ సభ్యులు పెన్ పవర్ ఎదుట వెల్లడించారు. ఈ ఆరోపణలకు సంబంధించి నిడదవోలుకు చెందిన లేటు జొన్నకుడి ఎడ్వర్డ్ విజయరత్నం కుటుంబ సభ్యులు జిల్లా రిజిస్ట్రార్‌కు సమర్పించిన ఫిర్యాదు, బాధితురాలు జయమ్మ వెల్లడించిన వివరాలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. అయితే, ఈ ఆరోపణలపై అధికారిక విచారణ జరిగి వాస్తవాలు నిర్ధారణ కావాల్సి ఉంది.


**అద్దె ఇంటి నుంచే వివాదానికి బీజం..? :** ఇంటి యజమాని జొన్నకుడి ఎడ్వర్డ్ విజయరత్నం భార్య జయమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. వాసిరెడ్డి రాఘవేంద్ర ప్రసాద్ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సమయంలో నిడదవోలులోని అల్లూరి సీతారామరాజు వీధిలో ఉన్న తమ ఇంటిని అద్దెకు తీసుకున్నారని తెలిపారు. అద్దెకు దిగే సమయంలో తాను తన భార్యతో కలిసి నివసిస్తానని చెప్పినప్పటికీ, అనంతరం శోభారాణి అనే మహిళతో కలిసి ఇంటిలో నివసించారని ఆమె ఆరోపించారు. ఈ వ్యవహారంపై తమ కుటుంబంలో వివాదం తలెత్తిందని, అనంతరం అద్దె ఇంటిలోని విలువైన కలప సామగ్రి, ఇతర వస్తువులు కనిపించకుండా పోయాయని జయమ్మ ఆరోపించారు. తమ కుటుంబానికి చెందిన పొలాల పత్రాలను కూడా తీసుకెళ్లి ఇప్పటివరకు తిరిగి ఇవ్వలేదని ఆమె వాపోయారు.

**"పత్రాలు తీసుకెళ్లారు.. తిరిగి ఇవ్వలేదు" :** తమ భూములకు సంబంధించిన కీలక పత్రాలు తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు తిరిగి ఇవ్వలేదని జయమ్మ ఆరోపించారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అద్దె ఇంటిలో జరిగినట్లు చెబుతున్న చోరీపై కూడా జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. తమ ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు అధికారులను ఆశ్రయించినా స్పందన లేకపోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసిన తర్వాత తమ కుటుంబంపై ఒత్తిళ్లు పెరిగాయని, ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని బెదిరింపులు వచ్చినట్లు ఆమె ఆరోపించారు.

**"కేసు వెనక్కి తీసుకోకపోతే ఏం చేయాలో అదే చేస్తా" అన్నారా..? :** తమ కుటుంబం చేసిన ఫిర్యాదును ఉపసంహరించుకోవాలని వాసిరెడ్డి రాఘవేంద్ర ప్రసాద్ నుంచి బెదిరింపులు వచ్చాయని జయమ్మ ఆరోపించారు. "కేసు వెనక్కి తీసుకోకపోతే ఏం చేయాలో అదే చేస్తా" అంటూ బెదిరించారని ఆమె పేర్కొన్నారు. ఈ బెదిరింపుల కారణంగా తన భర్త జొన్నకుడి ఎడ్వర్డ్ విజయరత్నం తీవ్ర మనస్తాపానికి గురయ్యారని, ఆ తర్వాత ఆయన మరణించారని జయమ్మ కన్నీటి పర్యంతమయ్యారు. తన భర్త మరణానికి ముందున్న పరిణామాలపై సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆమె కోరారు. అయితే, బెదిరింపుల కారణంగానే ఆయన మృతి చెందారనే ఆరోపణకు సంబంధించి అధికారిక దర్యాప్తు ద్వారా వాస్తవాలు నిర్ధారించాల్సి ఉంది.

**జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు.. అయినా చర్యలేవీ లేవా..? :** అద్దె ఇంటిలో దొంగతనం జరిగిందంటూ ఇంటి యజమాని జొన్నకుడి ఎడ్వర్డ్ విజయరత్నం జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఫిర్యాదులో ఇంటి నుంచి వస్తువులు తీసుకెళ్లడం, పత్రాలు తిరిగి ఇవ్వకపోవడం వంటి అంశాలను ప్రస్తావించినట్లు వారు పేర్కొన్నారు. ఫిర్యాదు చేసినప్పటికీ సంబంధిత శాఖ నుంచి తగిన స్థాయిలో స్పందన రాలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఫిర్యాదుపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు..? విచారణ జరిగిందా..? ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై శాఖాపరంగా ఏమైనా నివేదిక రూపొందించారా..? అన్న విషయాలు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారాయి.

**అధికారిక విధుల్లోనూ అవినీతి ఆరోపణలు..? :** ఇదిలా ఉండగా, వాసిరెడ్డి రాఘవేంద్ర ప్రసాద్ గతంలో అనంతపల్లి, వేగేశ్వరపురం ప్రాంతాల్లో పనిచేసిన సమయంలోనూ, ప్రస్తుతం భీమడోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సమయంలోనూ అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. లంచం లేకుండా రిజిస్ట్రేషన్లు జరగడం లేదని, ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయంతో కార్యాలయ వ్యవహారాలు సాగుతున్నాయని కొందరు ఆరోపిస్తున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో మధ్యవర్తుల పాత్ర పెరిగిందని, సాధారణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే, ఈ ఆరోపణలకు సంబంధించి నిర్దిష్ట ఆధారాలు, అధికారిక విచారణ నివేదికలు వెలుగులోకి రావాల్సి ఉంది.




**విచారణకు ప్రజల డిమాండ్ :** ఒక ప్రభుత్వ అధికారి చుట్టూ ఇంతటి తీవ్రమైన ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం, స్టాంపులు--రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు, విజిలెన్స్ విభాగం తక్షణమే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. నిడదవోలు అద్దె ఇంటి వివాదం, ఇంటి సామగ్రి అదృశ్యం, భూమి పత్రాల వ్యవహారం, ఫిర్యాదు ఉపసంహరణకు వచ్చినట్లు చెబుతున్న బెదిరింపులు, ఇంటి యజమాని మృతికి ముందు జరిగిన పరిణామాలు, అలాగే రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అవినీతి ఆరోపణలు-ఈ అంశాలన్నింటినీ విడివిడిగా కాకుండా సమగ్రంగా విచారించాల్సిన అవసరం ఉందని వారు అంటున్నారు. బాధిత కుటుంబం చేసిన ఆరోపణలపై నిష్పక్షపాత దర్యాప్తు జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిరాధారమైతే అదే విషయాన్ని అధికారికంగా స్పష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**కొసమెరుపు ఏంటంటే**

వాసిరెడ్డి రాఘవేంద్ర ప్రసాద్ పనిచేసిన ప్రతీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం లో ఒక ప్రైవేట్ మహిళ కీలక పాత్ర పోషిస్తుందనే గుసగుసలు స్థానికంగా వినిపిస్తున్నాయి. మరి దీనిపై ఉన్నత అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే, అయితే ఈ అంశంపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు. అభిప్రాయ డుతున్నారు. ఒకవేళ ఆరోపణల్లో నిజానిజాలు ఉంటే ప్రభుత్వం విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు."

**అనంతపల్లి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ లో ఆంటీ... ఆ నలుగురు యవ్వారం... ఏంటో... చూద్దాం..? ఎపిసోడ్ 7 లో.**

## ప్రధాని మోదీ నివాసం వద్ద హైడ్రామా..

- మొదటి పేజీ తరువాయి

ఈ ఘటనతో లోక్ కళ్యాణ్ మార్గ్ వద్ద తీవ్ర హైడ్రామా చోటుచేసుకుంది.

నీట్ పరీక్షల్లో అవకతవకలపై పార్లమెంటులో చర్చకు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆందోళన బాట పట్టింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో సమావేశమైన అనంతరం రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్, పవన్ ఖేరా వంటి సీనియర్ నేతల నేతృత్వంలో కాంగ్రెస్ ఎంపీలు ప్రధాని నివాసం వైపు పాదయాత్రగా బయలుదేరారు. అయితే, వారిని పోలీసులు బారికేడ్లతో అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్ నేతలు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కేంద్ర ప్రభుత్వం చర్చలకు ప్రయత్నించింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నిరసన స్థలానికి చేరుకుని రాహుల్ గాంధీతో మాట్లాడారు. పార్లమెంటులో నీట్ అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. అయితే, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రకటన చేయాలని కాంగ్రెస్ నేతలు పట్టుబట్టడంతో చర్చలు విఫలమయ్యాయి.

చర్చలు కొలిక్కి రాకపోవడంతో, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) సహా భారీగా మోహరించిన పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. నిరసనకారులను బలవంతంగా అక్కడి నుంచి తరలించారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్ బఘేల్, రణ్‌దీప్ సూర్జేవాలా, కె. సురేశ్, చరణ్‌జిత్ సింగ్ చన్నీ సహా పలువురు కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకుని సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ కూడా నిరసన స్థలానికి వచ్చి కాంగ్రెస్ నేతలకు మద్దతు తెలిపారు. నీట్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన పోలీసుల దాడిపై విచారణ జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ నేతలను అరెస్ట్ చేయడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. మరోవైపు, ప్రధాని నివాసం వంటి అత్యంత కీలకమైన, సున్నితమైన ప్రాంతంలో నిరసనలు చేపట్టడం భద్రతా నిబంధనలను ఉల్లంఘించడమేనని అధికార పక్షం విమర్శిస్తోంది. ఈ ఘటనతో నీట్ వివాదం మరింత వేడెక్కింది.

## మంగళగిరిలో నారా లోకేశ్ 7.30 గంటల నాన్ స్టాప్ 'పట్టా'భిషేకం

మంగళగిరి నియోజకవర్గంలోని అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు ఉద్దేశించిన 'మన ఇల్లు - మన లోకేశ్' కార్యక్రమం మంగళగిరిలో ఓ పండుగలా జరిగింది. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా తొలిరోజు 1331 మంది లబ్ధిదారులకు శాశ్వత ఇళ్ల పట్టాలను అందజేశారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించారు. ఉదయం 9:30 గంటలకు ప్రారంభమైన పట్టాల పంపిణీ సాయంత్రం 5 గంటల వరకు నిరంతరాయంగా కొనసాగింది. లబ్ధిదారుల 'పట్టా'భిషేకం అనదగ్గ మంత్రి లోకేశ్ దాదాపు ఏడున్నర గంటల పాటు నిలబడే ఉండడం విశేషం. ప్రతి లబ్ధిదారుడికి ఆయనే స్వయంగా పట్టాలు అందించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. పట్టా పత్రాలతో పాటు లబ్ధిదారులందరికీ నూతన వస్త్రాలను కూడా మంత్రి లోకేశ్ బహూకరించారు.

## రాహుల్ గాంధీ మాట మార్చారు

నీట్-యూజీ పరీక్ష వివాదంపై పార్లమెంటులో చర్చకు సిద్ధమని చెప్పినా, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చివరి నిమిషంలో మాట మార్చారని కేంద్ర ప్రభుత్వం ఆరోపించింది. దీంతో ప్రతిష్టంభన ఏర్పడిందని కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. ఇచ్చిన మాటకు రాహుల్ కట్టుబడలేదని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వంటి కొత్త షరతులు పెట్టడంతో చర్చలు ముందుకు సాగలేదని ఆయన విమర్శించారు.

నీట్ పరీక్షలో అవకతవకలు, విద్యార్థులపై పోలీసుల చర్యలకు నిరసనగా రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ సహా పలువురు కాంగ్రెస్ ఎంపీలు ఢిల్లీలోని ప్రధాని నివాసం సమీపంలో ధర్నా చేపట్టారు. ఈ క్రమంలో ధర్నా ప్రారంభమైన గంట తర్వాత మంత్రి జితేంద్ర సింగ్ అక్కడికి చేరుకుని రాహుల్‌తో కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాకు వివరణ ఇచ్చారు. నీట్ అంశంపై చర్చ జరపాలన్న కాంగ్రెస్ డిమాండ్‌కు కేంద్రం అంగీకరించిందని, కానీ ఆ తర్వాత రాహుల్ గాంధీ మరో కొత్త డిమాండ్‌ను తెరపైకి తేవడంతో చర్చలు విఫలమయ్యాయని జితేంద్ర సింగ్ వివరించారు.

మరోవైపు, ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలమయ్యాయని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. నీట్ వివాదానికి బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తమ పదవులకు రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. చర్చలు కొలిక్కి రాకపోవడంతో తమ నిరసన కొనసాగుతుందని ఆ పార్టీ నేతలు ప్రకటించారు.

# ఉపయోగం లేకుండా ఫుట్ ఓవర్ బ్రిడ్జి

### పట్టాలు దాటుతున్న ప్రయాణికులు.. ప్రమాదంలో ప్రాణాలు



**వేటపాలెం, పెన్ పవర్, జూలై 21:** వేటపాలెం రైల్వే స్టేషన్‌లో నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి ప్రయాణికులకు పూర్తిస్థాయిలో ఉపయోగపడకపోవడంతో వారు ఇప్పటికీ నేరుగా రైల్వే పట్టాలు దాటి వెళ్లాల్సి వస్తోందని స్థానికులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ప్లాట్‌ఫారమ్‌ల మధ్య భాగంలో నిర్మించాల్సిన వంతెనను చివరి భాగంలో ఏర్పాటు చేయడంతో చాలా మంది దానిని వినియోగించకుండా పట్టాలనే దాటుతున్నారని తెలిపారు. ఇటీవల స్టేషన్‌లో మూడో రైల్వే లైన్ అందుబాటులోకి రావడంతో రైళ్ల రాకపోకలు గణనీయంగా పెరిగాయి. దీంతో ఏ లైన్‌పై, ఏ దిశ నుంచి రైలు వస్తుందో అంచనా వేయడం కష్టంగా మారి ప్రయాణికులు ప్రాణాపాయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గతంలో కూడా పట్టాలు దాటే క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకుని పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు జరిగినట్లు గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఫుట్ ఓవర్ బ్రిడ్జి ప్రజలకు ఆశించిన విధంగా ఉపయోగపడకపోవడంతో నిరుపయోగంగా మారడమే కాకుండా, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఫుట్ ఓవర్ బ్రిడ్జిని అందరికీ సౌకర్యవంతంగా ఉపయోగపడేలా తగిన మార్పులు చేపట్టాలని, పట్టాలు దాటాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులను ప్రయాణికులు కోరుతున్నారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఏన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

# నేటి నుంచి విజయవాడలోఫ్యూచర్-రెడీ ఏపీ పోలీస్ రిట్రీట్--2026" ప్రారంభం



**విజయవాడ, పెన్ పవర్, జులై, 21 :** విజయవాడ అంబేద్కర్ కన్వెన్షన్ హాల్‌లో నేడు, రేపు రెండు రోజుల పాటు పోలీస్ రిట్రీట్. రిట్రీట్‌కు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించనున్న ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేలా ఏపీ పోలీస్‌ను మరింత సన్నద్ధం చేయడమే రిట్రీట్ లక్ష్యమని హోంమంత్రి అనిత. పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ ఐ ) సవాళ్లపై ప్రత్యేక చర్చలు. మహిళలు, చిన్నారుల భద్రతకు మరింత సమర్థవంతమైన కార్యాచరణ ప్రణాళికలపై సమీక్ష. డ్రోన్ ముప్పు, ఉగ్రవాద నిరోధం, అంతర్గత భద్రతపై నిపుణులతో విస్తృత చర్చలు.ఆధునిక సాంకేతికత వినియోగం, స్మార్ట్ పోలీసింగ్, డేటా ఆధారిత దర్యాప్తు వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి.

# జాబితాల్లో అభ్యంతరాలు ఉంటే జూలై 22 మధ్యాహ్నం నుంచి ఫిర్యాదులు స్వీకరణ జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ



**విజయవాడ,పెన్ పవర్,జూలై 21 :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న "తల్లికి వందనం" పథకానికి సంబంధించి అర్హుల జాబితా, అనర్హుల జాబితా, పరిశీలనలో ఉన్న లబ్ధిదారుల జాబితాలు జూలై 22 నుంచి జిల్లాలోని ప్రతి స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయంలో ప్రజల పరిశీలన కోసం ప్రదర్శించబడనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ తెలిపారు. తమ పేరు జాబితాలో లేకపోవడం, వ్యక్తిగత వివరాల్లో పొరపాట్లు ఉండటం, అనర్హుల జాబితాలో పేరు ఉండటం లేదా ఇతర అభ్యంతరాలు ఏవైనా ఉన్నట్లయితే, సంబంధిత మ్యాప్ చేయబడిన స్వర్ణ గ్రామం లేదా స్వర్ణ వార్డు కార్యాలయాన్ని సంప్రదించి తమ ఫిర్యాదును నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులను జూలై 22 మధ్యాహ్నం నుంచి స్వీకరిస్తామని తెలిపారు. ప్రజలు తమ అభ్యంతరాలు, సమస్యలను నిర్ణీత గడువులోగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు, అర్హత ప్రమాణాల ప్రకారం పూర్తిస్థాయిలో పరిశీలించి, అవసరమైన సవరణలు చేసి అర్హులైన వారికి న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు. తల్లికి వందనం పథకానికి అర్హులైన ప్రతి కుటుంబం తమకు సంబంధించిన జాబితాను సంబంధిత స్వర్ణ గ్రామం/స్వర్ణ వార్డు కార్యాలయంలో పరిశీలించాలని, ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఆలస్యం చేయకుండా వెంటనే ఫిర్యాదు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ప్రస్తుతం అర్హులైన తల్లులు 1,59,812 మంది, పిల్లలు 2,44,614 మంది ఉన్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

# వెట్టి చాకిరి బాధితులకు రూ.30 వేల తక్షణ ఉపశమన సాయం అందజేత

### బాపట్ల జిల్లాలో తొలిసారిగా నలుగురు విముక్తి పొందిన బాధితులకు ఇమ్మీడియట్ రిలీఫ్





**బాపట్ల, పెన్ పవర్, జూలై 21:** బాపట్ల జిల్లాలో వెట్టి చాకిరి నుంచి విముక్తి పొందిన నలుగురు బాధితులకు జిల్లా కలెక్టర్ సహకారంతో ఇమ్మీడియట్ రిలీఫ్ కింద ఒక్కొక్కరికి రూ.30 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ (ఏసీఎల్) శివప్రసాద్ అందజేశారు. వెట్టి చాకిరిలో నలుగురు బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని షాడోస్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లింది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఏసీఎల్ శివప్రసాద్ నేతృత్వంలో కార్మిక శాఖ, రెవెన్యూ శాఖ, పోలీసు శాఖ, డీసీపీఓ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సమన్వయంతో బాధితులను వెట్టి చాకిరి నుంచి రక్షించారు. అనంతరం అప్పటి బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి (ఆర్డీవో) శ్రీమతి గ్లోరియా చేతుల మీదుగా వారికి విడుదల ధ్రువపత్రాలు (రిలీజ్ సర్టిఫికెట్లు) అందజేశారు. తాజాగా జిల్లా కలెక్టర్ సహకారంతో నలుగురు బాధితులకు ఒక్కొక్కరికి రూ. 30 వేల చొప్పున తక్షణ ఉపశమన సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో షాడోస్ సంస్థ ప్రతినిధులు రాజా సాల్మన్, భాగ్యలక్ష్మి, అలేఖ్య, పావని, సిఫార్డ్ డైరెక్టర్ రవి ప్రదీప్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వెట్టి చాకిరి నుంచి విముక్తి పొందిన బాధితులకు బాపట్ల జిల్లాలో తొలిసారిగా రూ. 30 వేల ఇమ్మీడియట్ రిలీఫ్ అందజేయడం విశేషమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన జిల్లా కలెక్టర్‌కు షాడోస్ సంస్థ ప్రతినిధులు రాజా సాల్మన్, తిరుపతిరావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# రైతుగా మారిన ఎమ్మెల్యే

### క్షేత్రస్థాయి వాస్తవాల కోసం 11 ఎకరాల్లో సాగు

**రైతు కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు వినూత్న నిర్ణయం తీసుకున్న గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**

**3 ఎకరాల్లో ఆర్గానిక్, 8 ఎకరాల్లో బీపీటీ వరి సాగు**

**వరి సాగు చర్యను అభినందించిన సీఎం చంద్రబాబు**







**గుడివాడ, పెన్ పవర్ జూలై 21 :** ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలను కేవలం సమీక్షలకే పరిమితం కాకుండా ప్రత్యక్షంగా అనుభవించి తెలుసుకోవాలనే భావనతో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము రైతు పాత్రలోకి దిగారు. క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వ పథకాల అమలు, సాగునీటి నిర్వహణ, వ్యవసాయ శాఖ పనితీరును ప్రత్యక్షంగా అర్థం చేసుకునేందుకు ఆయన గుడ్లవల్లేరు మండలంలోని కూచికాయలపూడి గ్రామంలో 11 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని స్వయంగా వ్యవసాయం ప్రారంభించడం చర్చనీయాంశంగా మారింది. క్వాలిటీ ఫీడ్స్ అధినేత కోగంటి ఆంజనేయులకు చెందిన ఈ భూమిలో ఎమ్మెల్యే రాము స్వయంగా నారుమడి వేయడం, గట్లు మెరక చేయడం, విత్తనాలు వెదజల్లడం వంటి వ్యవసాయ పనుల్లో పాల్గొనడం ద్వారా రైతు జీవితాన్ని అనుభవించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ సందర్భంగా కౌలు రైతుగా అధికారిక గుర్తింపు కార్డును కూడా ఆయనకు అందజేశారు. గుడివాడలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే రాము నిర్ణయం గురించి తెలుసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రయత్నాన్ని అభినందించారు. ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని పనిచేస్తేనే పరిపాలనకు సార్థకత ఉంటుందని పేర్కొంటూ, ఎమ్మెల్యే రాముకు కౌలు గుర్తింపు కార్డును అందజేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, గుడివాడ వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావడంతో రైతుల అసలు సమస్యలను లోతుగా తెలుసుకోవాలనే ఉద్దేశంతో వ్యవసాయంలోకి వచ్చానని తెలిపారు. అధికారులు, రైతులు చెప్పే సమాచారం కంటే ప్రత్యక్ష అనుభవమే వాస్తవ పరిస్థితులను తెలియజేస్తుందని, అందుకే స్వయంగా సాగు చేస్తున్నానన్నారు. ప్రస్తుతం 11 ఎకరాల్లో 3 ఎకరాల్లో మైసూరు మల్లిక పద్ధతిలో ఆర్గానిక్ వ్యవసాయం, మిగిలిన 8 ఎకరాల్లో బీపీటీ వరి సాగు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన పెంచుకుని దశలవారీగా అమలు చేస్తానని, తన ప్రయత్నం విజయవంతమైతే ఇతర రైతులు కూడా ప్రత్యామ్నాయ పంటలపై ఆసక్తి చూపే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 27 సంవత్సరాలు అమెరికాలో ఉన్న తర్వాత స్వగ్రామంపై ఉన్న ప్రేమతో గుడివాడకు తిరిగి వచ్చానని, కుటుంబంలో వ్యవసాయ నేపథ్యం లేకపోయినా వ్యవసాయ శాఖ అధికారులు, అనుభవజ్ఞులైన రైతుల సూచనలతో సాగు పద్ధతులను నేర్చుకుంటున్నానని చెప్పారు. వ్యవసాయం చేయడం ద్వారా మానసికంగా ఎంతో సంతృప్తి కలుగుతోందని పేర్కొన్నారు. ఎరువుల వినియోగంలోనూ ప్రయోగాత్మకంగా ముందుకు సాగుతున్నానని, డీఏపీకి ప్రత్యామ్నాయంగా టీఎస్పీని తగిన మోతాదులో యూరియాతో కలిపి ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో చూపించాలనే ఉద్దేశంతోనే తాను రైతుగా మారానని స్పష్టం చేశారు. సాగునీటి నిర్వహణపై కూడా ఎమ్మెల్యే రాము కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరిగేషన్, వ్యవసాయ శాఖల మధ్య సమన్వయం లోపించడం వల్ల కొన్ని ప్రాంతాల్లో నీటి సమస్యలు తలెత్తుతున్నాయని, ఈసారి గుడివాడ నియోజకవర్గంలో ఒంతుల వారీగా నీటి విడుదలకు ప్రత్యేక షెడ్యూల్ సిద్ధం చేసినట్లు తెలిపారు. పట్టిసీమ ద్వారా సాగునీరు అందుతున్నప్పటికీ సమన్వయ లోపాల కారణంగా ముందుగానే నారుమళ్లు వేయడం వల్ల కొన్నిచోట్ల ఇబ్బందులు ఎదురయ్యాయని, ముందస్తు ప్రణాళికతో వాటిని నివారించవచ్చని అధికారులకు సూచించినట్లు చెప్పారు. రైతు సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఎమ్మెల్యే స్వయంగా వ్యవసాయంలోకి దిగడం అరుదైన చర్యగా పలువురు రైతులు, వ్యవసాయ నిపుణులు, ప్రజాప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు. రైతు జీవితాన్ని అనుభవించి విధాన నిర్ణయాలు తీసుకోవాలనే ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రయత్నాన్ని కూటమి శ్రేణులతో పాటు రైతులు, సాధారణ ప్రజలు కూడా అభినందిస్తున్నారు.

# ప్రభుత్వం అమలు చేస్తున్న సేవలు,సంక్షేమ పథకాలు ప్రజలకుసమర్థవంతంగా అందేలాఅధికారులు పనిచేయాలి : జిల్లాకలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ



**గుంటూరు, పెన్ పవర్, జులై, 21 :** కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పి.జి.ఆర్.ఎస్., ఎస్.ఐ.ఆర్., అంగన్వాడీ సేవలు, విద్య, ఆరోగ్యం తదితర అంశాలపై సమీక్షించారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలపై తల్లులకు అవగాహన కల్పించాలని, మండల ప్రత్యేక అధికారులు పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శించాలని సూచించారు. ఎస్.ఐ.ఆర్. కార్యక్రమంలో ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్, డూప్లికేట్ ఓటర్ల వివరాలతో పాటు మ్యాపింగ్ జరగని, ఎనామలీ కేసులను పూర్తిగా పరిశీలించి ఈ నెల 24లోపు ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి అవసరమైన సమాచారం అందించాలని తెలిపారు. అలాగే వి.బి.జి. రామ్ జి పథకం కింద లబ్ధిదారుల సంఖ్య పెంచడం, మోడల్ చెరువుల అభివృద్ధి, ఉద్యోగుల తుది సీనియారిటీ జాబితా విడుదల వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్ణీత గడువుల్లో అన్ని కార్యక్రమాలను పూర్తి చేయాలని సూచించారు. గ్రీన్ గుంటూరు కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 15 నాటికి 1.25 లక్షల మొక్కలు నాటి ప్రతి మొక్కకు జియో టాగింగ్ చేయాలని ఆదేశించారు. ఈ నెల 24న నిర్వహించే మెగా పి.టి.ఎం.కు అన్ని విద్యాసంస్థల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, ఈ నెల 22న తల్లికి వందనం పథకం కింద అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ అవుతుందని తెలిపారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెంపొందించేలా అధికారులు పనిచేయాలని, రీ-సర్వే, ఈ-కేవైసీ, పి.జి.ఆర్.ఎస్. అర్జీల పరిష్కారంలో పారదర్శకత పాటించాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆటిజం పిల్లలకు మెరుగైన సేవల కోసం కార్యాచరణ ప్రణాళిక

### ఆయుష్ సేవల విస్తరణపై కలెక్టర్‌కు సూచనలు చేసిన డాక్టర్ దాసరి చంద్రశేఖర్



**బాపట్ల,పెన్‌పవర్,జూలై21:** బాపట్ల జిల్లాలోని స్వర్ణ భవిత (ఆటిజం ప్లస్) సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ ఐఏఎస్ ఆదేశాల మేరకు జిల్లా ఆటిజం సెంటర్ ఆయుష్ సెల్ నోడల్ అధికారిగా నియమితులైన ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆటిజం పిల్లలకు ఆయుష్ విధానంలో అందించగల వైద్య సేవలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై వివరించారు. జిల్లాలోని ప్రజలకు స్వర్ణ భవిత (ఆటిజం ప్లస్) సెంటర్ అందిస్తున్న సేవల గురించి విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రచారం చేపట్టాలని సూచించారు. అదేవిధంగా జిల్లాలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయం వద్ద ఒక రోజు ఆటిజం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఆటిజం పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలకు చేరవేయవచ్చని తెలిపారు. దీనివల్ల ఆటిజం సమస్యతో బాధపడుతున్న చిన్నారుల తల్లిదండ్రులకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కావడంతో పాటు, పిల్లల భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్న కుటుంబాలకు మార్గనిర్దేశం, భరోసా కల్పించే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్‌కు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్, డాక్టర్ దాసరి చంద్రశేఖర్‌తో కలిసి ఆటిజం ప్లస్ సెంటర్‌లోని వివిధ విభాగాలు, గదులను పరిశీలించి అక్కడ అందుతున్న సేవలను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) విజయమ్మ, జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి (డీసీహెచ్‌ఎస్) పద్మావతి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆవిష్కరణలకు ఊతం.. స్టార్టప్‌లకు అండ

యువతలో సృజనాత్మకతను వెలికితీసి, స్టార్టప్ సంస్కృతిని ప్రోత్సహించే లక్ష్యంతో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్టీఐహెచ్) ఆధ్వర్యంలో తిరుపతిలో 'స్టార్టప్ పిచ్చాథాన్-2026' విజయవంతంగా ముగిసింది. స్థానిక కచ్చపి ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 300 మంది విద్యార్థులు, స్టార్టప్ వ్యవస్థాపకులు, అధ్యాపకులు, పరిశ్రమ ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. కేవలం మంచి ఆలోచన ఉంటే సరిపోదని, దాన్ని సమర్థంగా అమలు చేసినప్పుడే విజయవంతమైన స్టార్టప్‌గా రూపాంతరం చెందుతుందని జ్ఞాన్ సర్కిల్ వెంచర్స్ భాగస్వామి, శ్రీసిటీ వర్సిటీ సహ వ్యవస్థాపకుడు, ముఖ్యఅతిథి దీనానాథ్ హరపనహళ్లి స్పష్టం చేశారు. లెక్స్‌స్టార్ట్ పార్టనర్స్ భాగస్వామి స్మితా రెడ్డి మాట్లాడుతూ.. స్టార్టప్‌లు చట్టపరమైన నిబంధనలు పాటించడం, మేధోసంపత్తి హక్కుల పరిరక్షణ అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అప్పుడే పెట్టుబడిదారుల్లో నమ్మకం కలుగుతుందన్నారు. కెల్విన్6కే వ్యవస్థాపకుడు, సీఈఓ డాక్టర్ ప్రదీప్‌కుమార్ సుందరరాజ్ తన పారిశ్రామిక ప్రయాణాన్ని వివరిస్తూ.. సవాళ్లను అవకాశాలుగా మలుచుకుంటూ పట్టుదలతో ముందుకు సాగాలని తెలిపారు.

**ఆకట్టుకున్న ప్రదర్శన :** ఈ పిచ్చాథాన్‌లో 10 స్టార్టప్‌లు తమ వినూత్న ఆలోచనలను జ్యూరీ ముందు ప్రదర్శించాయి. దీనానాథ్ హరపనహళ్లి, స్మితారెడ్డి, డా.ప్రదీప్‌కుమార్, విజయవంత్ మాథుర్, ఆర్టీఐహెచ్ ఇంక్యుబేషన్ విభాగాధిపతి ప్రగతి.డి తదితరులు జ్యూరీ సభ్యులుగా వ్యవహరించారు.

# ఎంఎస్ఎంఈ కామన్ ఫెసిలిటీ సెంటర్ల ఏర్పాటుకు 90 శాతం వరకు ప్రభుత్వ సాయం: విశ్వ మనోహరన్

**ఆగస్టు 15లోగా అందిన అర్హత కలిగిన దరఖాస్తులను 60 రోజుల్లో ప్రాసెస్**

**ఎంఎస్ఎంఈ క్లస్టర్ల బలోపేతానికి భారీగా ఆర్థిక సహాయం**

**అమరావతి, పెన్ పవర్ జూలై 21:** రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందిస్తోందని ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈఓ విశ్వ మనోహరన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఏపీ-సీడీపీ) కింద కామన్ ఫెసిలిటీ సెంటర్ల (సీఎఫ్‌సీ) ఏర్పాటుకు ప్రాజెక్టు వ్యయంలో 90 శాతం వరకు ప్రభుత్వ ఆర్థిక సాయం అందిస్తుందని చెప్పారు. దీని ద్వారా ఎంఎస్ఎంఈ క్లస్టర్లకు ఒకే చోట ఉమ్మడి మౌలిక సదుపాయాలు, ఆధునిక యంత్రాలు, ఇతర అవసరమైన సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఆధునిక యంత్రాలు, ఉమ్మడి మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా సూక్ష్మ, చిన్న పరిశ్రమల ఉత్పాదకత, పోటీతత్వాన్ని పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని విశ్వ మనోహరన్ తెలిపారు. కామన్ ఫెసిలిటీ సెంటర్ల ద్వారా ముడి పదార్థాలను నాణ్యమైన తుది ఉత్పత్తులుగా మార్చుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. అలాగే ఇండస్ట్రీ 4.0, గ్రీన్ టెక్నాలజీ, పర్యావరణహితమైన, స్థిరమైన ఉత్పత్తి విధానాలను ప్రోత్సహించవచ్చని తెలిపారు. ఏపీ-సీడీపీ కింద సాధారణ కేటగిరీ ప్రాజెక్టులకు ప్రాజెక్టు వ్యయంలో 80 శాతం వరకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుంది. మహిళలు, ఎస్సీ, ఎస్టీల భాగస్వామ్యం 50 శాతం లేదా అంతకంటే ఎక్కువగా ఉన్న ప్రత్యేక కేటగిరీ ప్రాజెక్టులకు 90 శాతం వరకు ప్రభుత్వ సాయం లభిస్తుంది. మిగిలిన మొత్తాన్ని సంబంధిత పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) భరించాల్సి ఉంటుంది. ఈ పథకం కింద భూమి, భవనం, యంత్రాలు, పరికరాలు, ప్రాజెక్టు ప్రారంభానికి ముందు అయ్యే ఖర్చులు, వర్కింగ్ క్యాపిటల్ కోసం మార్జిన్ మనీ వంటి వాటికి ఆర్థిక సాయం పొందవచ్చు. అయితే భూమి, భవనం ఖర్చు మొత్తం ప్రాజెక్టు వ్యయంలో 30 శాతానికి మించకూడదు. ఎంఎస్ఎంఈలు తమ ఉత్పత్తులకు మరింత మార్కెట్‌ను పొందడంతో పాటు ఆధునిక, పర్యావరణహిత సాంకేతికతలను వినియోగించేందుకు కూడా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. రూ.5 కోట్ల వరకు ఉన్న ప్రాజెక్టులను 12 నుంచి 15 నెలల్లో, రూ.5 కోట్లకు పైగా నుంచి రూ.10 కోట్ల వరకు ఉన్న ప్రాజెక్టులను 15 నుంచి 18 నెలల్లో పూర్తి చేసేలా కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు విశ్వ మనోహరన్ తెలిపారు. ఆగస్టు 15, 2026లోగా అందిన అర్హత కలిగిన దరఖాస్తులను 60 రోజుల్లో ప్రాసెస్ చేస్తామని చెప్పారు. రిజిస్టర్డ్ సొసైటీలు, సహకార సంఘాలు, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్లు (ఎఫ్‌పీవోలు), ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీలు (ఎఫ్‌పీసీలు), మండల సమాఖ్యలు, స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీలు), రిజిస్టర్డ్ ఇండస్ట్రీ అసోసియేషన్లు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకోవచ్చు. రిజిస్టర్డ్ ఇండస్ట్రీ అసోసియేషన్లలో కనీసం 200 మంది సభ్యులు ఉండాలి. వారిలో కనీసం 100 మందికి చెల్లుబాటు అయ్యే ఉద్యం రిజిస్ట్రేషన్ ఉండాలి. దరఖాస్తుదారులు ఉద్యం రిజిస్ట్రేషన్ కలిగిన కనీసం 10 సూక్ష్మ, చిన్న పరిశ్రమలతో ఎస్పీవీ ఏర్పాటు చేసుకోవాలి. కనీసం 15 సంవత్సరాల కాలానికి భూమి లేదా భవనం అందుబాటులో ఉండాలి. అనంతరం డీపీఆర్ సిద్ధం చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అర్హత కలిగిన ఎంఎస్ఎంఈలు, పరిశ్రమల సంఘాలు, ఇతర సంస్థలు ఏపీ-సీడీపీ పథకాన్ని సద్వినియోగం చేసుకుని కామన్ ఫెసిలిటీ సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలని విశ్వ మనోహరన్ కోరారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం, ఉత్పాదకత, పోటీతత్వాన్ని పెంచడం, మార్కెట్ అవకాశాలను విస్తరించడం ద్వారా రాష్ట్రంలో స్థిరమైన పారిశ్రామిక అభివృద్ధికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. ఏపీ-సీడీపీ మార్గదర్శకాలు ఏపీ ఎంఎస్ఎంఈ వన్ పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అర్హత కలిగిన వారు www.apmsmeone.ap.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, మరింత సమాచారం, మార్గదర్శకత్వం కోసం సంబంధిత జిల్లా పరిశ్రమల కేంద్రాలను (డీఐసీ) సంప్రదించాలని సూచించారు.

## దేశ సేవలో మరిన్ని విజయాలుసాధించాలని ఇంజనీర్ గ్రౌండ్ టెస్టింగ్ బృందానికి బీజేపీ నాయకుల అభినందనలు



**గుంటూరు, పెన్ పవర్, జులై, 21 :** దేశ రక్షణ, మౌలిక సదుపాయాలు మరియు సాంకేతిక రంగాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఇంజనీర్ గ్రౌండ్ టెస్టింగ్ టీమ్‌కు చెందిన శ్రీ ఊరుబండి కుటుంబరాయుడు గారిని భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు, జాతీయ స్పైసెస్ బోర్డు సభ్యులు కొత్తూరు వెంకట సుబ్బారావు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దేశ అభివృద్ధి మరియు భద్రతకు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సేవలందిస్తున్న నిపుణులు దేశానికి గర్వకారణమని కొనియాడారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మరింత నిబద్ధతతో సేవలందించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఊరుబండి కుటుంబరాయుడు భవిష్యత్తులో కూడా దేశ అభివృద్ధికి తన వంతు సేవలను అందిస్తూ, యువతకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షిస్తూ బీజేపీ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వి. సుబ్బారావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చరక కుమార్ గౌడ్, బీజేపీ జిల్లా కార్యదర్శులు కె. నారాయణరెడ్డి, నారదాసు వీరమణి తదితరులు పాల్గొని ఊరుబండి కుటుంబరాయుడును అభినందించి, ఘనంగా సన్మానించారు.

## ఆటిజం బాధిత పిల్లలకు ప్రత్యేక ఆయుష్ సేవలు అందుబాటులోకి రానున్నాయి : డాక్టర్ దాసరి చంద్రశేఖర్



**ఉప్పుటూరు, పెన్ పవర్, జూలై 21:** బాపట్ల జిల్లాలో త్వరలో ప్రారంభం కానున్న స్వర్ణ భవిత (ఆటిజం ప్లస్ సెంటర్) లో ఆటిజం బాధిత పిల్లలకు ప్రత్యేక ఆయుష్ వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యాధికారి డాక్టర్ దాసరి చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం పెన్ పవర్ పత్రికతో మాట్లాడుతూ, గౌరవ బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఐఏఎస్ తనను స్వర్ణ భవిత (ఆటిజం ప్లస్ సెంటర్) లోని ఆయుష్ సెల్ జిల్లా నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. త్వరలో ప్రారంభమయ్యే ఈ కేంద్రంలో వివిధ ప్రభుత్వ శాఖల సేవలతో పాటు ప్రత్యేకంగా ఆయుష్ ఆధారిత ఆటిజం చికిత్సా విధానాలు కూడా అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఆటిజంతో బాధపడుతున్న చిన్నారుల సమగ్ర అభివృద్ధికి ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఆటిజంతో బాధపడుతున్న తమ పిల్లలను ఈ కేంద్రంలో నమోదు చేసి అందుబాటులో ఉండే వైద్య, పునరావాస సేవలను వినియోగించుకోవాలని డాక్టర్ దాసరి చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. ఈ కేంద్రం ద్వారా పిల్లల ఆరోగ్యాభివృద్ధి, ప్రవర్తనా వికాసం, జీవన నైపుణ్యాల మెరుగుదలకు తోడ్పాటు అందుతుందని ఆయన తెలిపారు.

# ఓటర్ల అర్హతపై అత్యుత్తమవిధానాలపై అంతర్జాతీయ వర్క్‌షాప్‌లో వక్తల మాట



**విజయవాడ, పెన్ పవర్, జులై, 21 :** ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రజల భాగస్వామ్యమే అసలైన బలమని, ప్రతి ఓటు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే అమూల్యమైన శక్తి అని వక్తలు పేర్కొన్నారు. ఓటు హక్కు అనేది కేవలం రాజ్యాంగం కల్పించిన హక్కు మాత్రమే కాదని, ప్రతి పౌరుడు నిర్వర్తించాల్సిన అత్యున్నత బాధ్యత కూడా అని వారు స్పష్టం చేశారు. మంగళవారం నగరంలోని లెమన్ ట్రీ హోటల్‌లో ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ (ఐఐఐడీఈఎం), ఈసీఐ, ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమోక్రసీ అండ్ ఎలక్టోరల్ అసిస్టెన్స్ (ఐడియా), ఏపీ సీఈవో సంయుక్త ఆధ్వర్యంలో ఓటర్ల అర్హతలపై అంతర్జాతీయ వర్క్‌షాప్ జరిగింది. ఈ కార్యశాలకు ఈసీఐ, ఐఐఐడీఈఎం, వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఎన్నికల విభాగాల ప్రతినిధులు, విద్యావేత్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు భౌతికంగా, వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ కార్యక్రమం ముఖ్య అతిథి, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, దాని సంస్థలు, ఎన్నికల వ్యవస్థలు సజావుగా, సమర్థవంతంగా పనిచేయడమనేది వివిధ పక్షాల చురుకైన, బాధ్యతాయుతమైన భాగస్వామ్యంపై ఆధారపడి ఉంటుందని.. ప్రజల భాగస్వామ్యమే ప్రజాస్వామ్య విజయానికి, విశ్వసనీయతకు, బలోపేతానికి నిజమైన పునాది అని పేర్కొన్నారు. మంచి అవగాహనతో సరైన నిర్ణయం తీసుకోగల ఓటరే ప్రజాస్వామ్య వ్యవస్థ పరిఢవిల్లడానికి కీలకమన్నారు. తాను విద్యార్థిగా ఉన్న సమయంలో కొన్ని జిల్లాలు, ప్రాంతాల్లో పోలింగ్ శాతం 30% లేదా అంతకంటే తక్కువగా ఉండేదని.. ఆ తర్వాత అది క్రమేణా పెరుగుతూ వస్తోందని.. ఇటీవల పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో ఇది 92 శాతం దాటిందని వివరించారు. ఓటర్లలో అవగాహన, వారి భాగస్వామ్యం కోసం ఈసీఐ తీసుకున్న బలమైన చర్యలు ఈ ఫలితాలకు దోహదం చేశాయన్నారు. ఓటు వేయడం కోసం ప్రజలు తమ జీవనోపాధిని లేదా ఉద్యోగాలను వదిలి సొంత ఊళ్లకు రాకుండా, ఎన్నికల ప్రక్రియలో వారిని ఎలా భాగస్వాములను చేయాలనే దానిపై దృష్టిసారించాల్సిన అవసరముందన్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ వ్యాప్త అత్యుత్తమ విధానాల అధ్యయనం, సమాచార మార్పిడికి ఇలాంటి కార్యశాలలు ఉపయోగపడతాయని అనిల్‌చంద్ర పునేఠా పేర్కొన్నారు. ప్రసంగంలో భాగంగా స్కాండినేవియన్ దేశాల్లో ఓటర్ల ఉన్నత స్థాయి అవగాహన గురించి కూడా వివరించారు. అక్షరక్రమంలోనే కాదు.. పోలింగ్ శాతంలోనూ ముందుండాలి: రాష్ట్ర మాజీ ఎన్నికల కమిషనర్ ఎన్.రమేష్ కుమార్ అక్షరక్రమంలోనే కాదు.. పోలింగ్ శాతంలోనూ ఆంధ్రప్రదేశ్ ఎప్పుడూ ముందుండాలని ప్రత్యేక అతిథి, రాష్ట్ర మాజీ ఎన్నికల కమిషనర్, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ అన్నారు. ఓటు హక్కు కేవలం హక్కు మాత్రమే కాదని.. అది బాధ్యత కూడా అని, విశిష్టమైన ఓటు హక్కు గురించి యువత తెలుసుకొని, అందరికీ తెలియజేయాలని అన్నారు. పొరుగు దేశాలతో చూస్తే మన భారతదేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టంగా ఉందని.. ఇందుకు ప్రధాన కారణం ఎలక్షన్ కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తితో, విచక్షణతో పనిచేయడమేనని పేర్కొన్నారు. ఓటు హక్కు అనేది రాజ్యాంగపరంగా లభించిన హక్కు అని.. దాన్ని బాధ్యతాయుతంగా భావించాలి, గౌరవించాలి, గుర్తించాలి, వ్యవహరించాలని.. అలా లేనప్పుడు అది బాధ్యతారాహిత్యమే అవుతుందన్నారు. కీలమైన ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్)కు సంబంధించి బీఎల్‌వోలకు సరైన శిక్షణ అందించి, వారి బాధ్యతను గుర్తుచేస్తూ ఇక్కడి కలెక్టర్లు ముందుకు తీసుకెళ్లడం హర్షణీయమని రమేష్ కుమార్ పేర్కొన్నారు. చట్టపరంగా వచ్చే హక్కులు, రాజ్యాంగ పరంగా వచ్చే హక్కులు, ప్రాథమిక హక్కులు గురించి వివరించడంతో పాటు ఓటు హక్కుకు సంబంధించి వివిధ కేసుల గురించి ఆయన వివరించారు.

**సమ్మిళిత ప్రపంచం కోసం ప్రజాస్వామ్యం: ఏపీ సీఈవో వివేక్ యాదవ్**

రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో) వివేక్ యాదవ్ మాట్లాడుతూ భారత్ ఈ ఏడాది ఇంటర్నేషనల్ ఐడియా కౌన్సిల్ బాధ్యతలను స్వీకరించిన సందర్భంగా భారత ఎన్నికల సంఘం సూచనల మేరకు మన రాష్ట్రం ఈ కీలకమైన అధ్యయన బాధ్యతను చేపట్టినట్లు తెలిపారు. సమ్మిళిత, శాంతియుత, స్థితిస్థాపక, సుస్థిర ప్రపంచం కోసం ప్రజాస్వామ్యం అనే ప్రధాన ఇతివృత్తంతో ఇంటర్నేషనల్ ఐడియాకు భారత్ అధ్యక్షత వహిస్తున్నట్లు వివరించారు. ఓటర్ల అర్హత అంశంపై 9-సోపానాల ద్వారా క్షేత్రస్థాయి అధ్యయనం చేసి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో వినియోగించేలా నమూనా ప్రమాణాలను రాష్ట్రం రూపొందిస్తోందని పేర్కొన్నారు. అనర్హులైన ఓటర్ల పేర్లను తొలగించి, 18 ఏళ్లు నిండిన అర్హులందరికీ ఓటు హక్కు కల్పించి పారదర్శకమైన, లోపరహితమైన ఓటర్ల జాబితాను తయారు చేయడమే ఎస్ఐఆర్ లక్ష్యమని తెలియజేస్తూ కార్యక్రమం ప్రగతిని సీఈవో వివేక్ యాదవ్ వివరించారు. కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ మాట్లాడుతూలి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అనేది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి గొప్ప అవకాశమని పేర్కొన్నారు. సార్వజనీన ఓటు హక్కుతో పాటు ఆటోమేటిక్ రిజిస్ట్రేషన్, ప్రాంతం మారినప్పుడు ఆటోమేటిక్ షిఫ్టింగ్, రాజకీయ పార్టీలలో నమ్మకం సాధించడం అనేవి ఆదర్శవంతమైన ఓటర్ల జాబితాకు ముఖ్య సూత్రాలన్నారు. స్వచ్ఛందంగా ఆధార్ అనుసంధానం వల్ల భవిష్యత్తులో డిజిటల్ డేటా ఆధారంగా తప్పులు లేని, స్వయంచాలకంగా నమోదయ్యే ఓటర్ల జాబితాను తయారు చేయడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. లిఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ముగింపు ఉపన్యాసమిస్తూ..ఓటర్ల జాబితాలో నమోదు అనేది కేవలం పరిపాలనాపరమైన పని మాత్రమే కాదని, అది ఒక రాజ్యాంగ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా పవిత్రతను కాపాడేందుకు చట్టపరమైన కచ్చితత్వంతో పాటు మానవతా దృక్పథం అవసరమని, అలాగే అకడమిక్ పరిశోధనలు క్షేత్రస్థాయి అధికారుల ప్రత్యక్ష అనుభవాలు అత్యుత్తమ విధానాల రూపకల్పనకు దోహదం చేస్తాయని వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు, అధికారులు, భాగస్వామ్య సంస్థలకు అభినందనలు తెలియజేస్తూ, ఈ వర్క్‌షాప్ ద్వారా వచ్చిన సూచనలు భవిష్యత్ ఎన్నికల సంస్కరణలకు, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరచడానికి ఎంతగానో ఉపయోగపడతాయని ఆకాంక్షిస్తూ తన ప్రసంగాన్ని ముగించారు. కార్యశాలలో పలు కీలక అంశాలతో టెక్నికల్ సెషన్లు జరిగాయి. కంపేరిటివ్ లీగల్ ట్రెడిషన్స్, ఫ్రాంఛైజ్ క్వాలిఫికేషన్స్, గ్లోబల్ బేస్‌లైన్స్, అంతర్జాతీయ అత్యుత్తమ విధానాలు, ఓటర్ల అర్హతకు సంబంధించి గ్లోబల్ స్టాండర్డ్స్, ఇంటర్నేషనల్ డేటా మోడల్స్ తదితర అంశాలపై వివిధ యూనివర్సిటీల ప్రముఖులు, ఐఐఐడీఈఎం, ఐడీఈఏ ప్రతినిధులు తదితరులు పవర్ పాయింట్ ప్రజంటేషన్స్ ఇచ్చారు. ప్రశ్న-సమాధానాల సెషన్లతో మేధోమథన చర్చ జరిగింది.

## అమెరికాలో గుండెపోటుతో ఏపీ యువకుడు మృతి

అమెరికాలో గుండెపోటుతో ఏపీ యువకుడు మృతి చెందాడు. పల్నాడు జిల్లా గురజాల మండలం దైద గ్రామానికి చెందిన రవితేజ (34) 2019లో ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉద్యోగం సాధించాడు. ఒహాయో రాష్ట్రం క్లీవ్‌ల్యాండ్‌లో నివాసం ఉంటూ ఇటీవల కొత్త ఇంటిని కొనుగోలు చేసి గృహప్రవేశానికి తల్లిదండ్రులను పిలిపించుకున్నాడు. కాగా, ఈనెల 18న రాత్రి అందరూ కలిసి భోజనం చేస్తుండగా రవితేజకు తీవ్రమైన గుండెనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే హాస్పిటల్‌కు తరలించారు. సర్జరీ చేసినప్పటికీ పరిస్థితి విషమించడంతో రవితేజ చనిపోయినట్లు తెలిసింది.

# ప్రభుత్వ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ అందించడమే లోకేశ్ లక్ష్యం : ప్రత్తిపాటి

**రెండేళ్లలో ప్రభుత్వ పాఠశాల్ని లోకేశ్ కార్పొరేట్ స్కూల్సను తలదన్నేలా తీర్చిదిద్దారు.**


**ఎస్సీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించి, విద్యార్థులకు దుప్పట్లు, ప్లేట్లు, నైట్ డ్రస్సులు పంపిణీ చేసిన ప్రత్తిపాటి**





**చిలకలూరిపేట, పెన్ పవర్, జూలై 21:** ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ అందించాలన్న లక్ష్యంతోనే నారా లోకేశ్ విద్యాశాఖ బాధ్యతలు చేపట్టారని, ఆయన ఆశయాన్ని నిజం చేసేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు బాగా కష్టపడాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. పట్టణంలోని ఎస్సీ బాలుర సంక్షేమ వసతిగృహాన్ని పరిశీలించిన ఆయన.. విద్యార్థులకు ప్రభుత్వం అందించిన దుప్పట్లు, భోజన ప్లేట్లు, నైట్ డ్రస్సుల్ని స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడిన ఆయన.. వసతిగృహంలో, పాఠశాలల్లో ఏమైనా సమస్యలున్నాయా. ఉపాధ్యాయులు మీతో ఎలా ఉంటున్నారని ప్రశ్నించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయుల్ని ఉద్దేశించి మాట్లాడారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి, విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో చదవాలి.. ఏపీ విద్యార్థులు, యువత మేధస్సును ప్రపంచం గుర్తించేలా చేయాలన్న గొప్ప లక్ష్యసాధన దిశగా లోకేశ్ విద్యాశాఖను సమర్థవంతంగా నిర్వహిస్తున్నాడని ప్రత్తిపాటి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్ని కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా అభివృద్ధి చేశారని, విద్యాభోధనతో పాటు.. యూనిఫామ్, పుస్తకాలు, భోజనం, తాగునీరు, మరుగుదొడ్ల సహా ప్రతి చిన్న అంశాన్ని లోకేశ్ ప్రత్యేకంగా గమనిస్తున్నాడని ప్రత్తిపాటి చెప్పారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి, వారి కలల్ని నిజం చేసే దిశగా విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో చదివి, మంచి ఉన్నత స్థానాలకు వెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు. నియోజకవర్గంలో విద్యనభ్యసించే విద్యార్థులకు ఎక్కడ ఎలాంటి సమస్య వచ్చినా, ఎప్పుడైనా తన ఇంటికి రావచ్చని ప్రత్తిపాటి భరోసా ఇచ్చారు. ప్రభుత్వ విద్యాలయాలు, వసతిగృహాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, వార్డెన్లపైనే ఉందని, వారి నిర్లక్ష్యం, అజాగ్రత్తల వల్ల చిన్నారులకు ఎలాంటి సమస్యలు వచ్చినా ఉపేక్షించనని ఈ సందర్భంగా ప్రత్తిపాటి స్పష్టంచేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, బ్రహ్మయ్య, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు తుపాకుల అప్పారావు, ముల్లా కరిముల్లా, పిల్లి లెనిన్, గెరా రాము, పిల్లి మాణిక్యాలరావు, జాషువా, పిల్లి ధనలక్ష్మి, చిన్న బాబు, మైల గణేష్, రాంబాబు, టీడీపీ నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో బిహార్ కంటే దారుణమైన పరిస్థితులు : మాజీ మంత్రి విడదల రజిని



అమరావతి : ఆంధ్రప్రదేశ్ లో మహిళలకు రక్షణ లేదని వైసీపీ నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో బిహార్ కంటే దారుణమైన పరిస్థితులున్నాయని వైసీపీ మాజీ మంత్రి విడదల రజిని ఆరోపించారు. ఇటీవల గుంటూరు నగరంలోని కృష్ణబాబు కాలనీలో టీడీపీ నాయకులు మహిళను వివస్త్రకు గురిచేసి , దాడికి పాల్పడ్డారు. ఈ సందర్భంగా గాయపడ్డ బాధితురాలిని ఆమె పరామర్శించారు. అనంతరం విడదల రజిని మాట్లాడుతూ ముందుగానే బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. వైసీపీ మహిళా అధ్యక్షురాలు వరుదు కల్యాణి మాట్లాడుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు గూండాల్లా వ్యవహరించి మహిళపై దాడులు చేశారని ఆరోపించారు. మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఇన్నోవేషన్ స్టార్టప్‌పై శిక్షణ

తిరుపతి సిటీ: ఎస్వీయూలో అధ్యాపకులకు ఆరు రోజుల పాటు జరగనున్న ఇన్నోవేషన్ స్టార్టప్ ఎకో సిస్టం అండ్ ఎంటర్‌ప్రైనర్ షిప్ ఎంపవరింగ్ ఎడ్యుకేటర్స్ టు బిల్డ్ ఫ్యూచర్ ఇన్నోవేటర్స్ అనే అంశంపై అధ్యాపక అభివృద్ధి కార్యక్రమం ప్రారంభమైంది. రూసా ఫేజ్--2, సెంటర్ ఆఫ్‌ఎక్సలెన్స్ ఇన్ వైరస్ లైక్ పార్టికల్స్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని వీసీ టాటా నర్సింగరావు సోమవారం ప్రారంభించారు. అనంతనం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచనలను గుర్తించి వాటికి సరైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. ఉపయోగకరమైన ఆవిష్కరణలు, స్టార్టప్‌లుగా రూపుదిద్దే వాతావరణాన్ని విశ్వవిద్యాలయాలు కల్పించాలని పేర్కొన్నారు. రెక్టార్ ఆచార్య అప్పారావు మాట్లాడుతూ యువప్రతిభను గుర్తించి విద్యార్థులను ఆవిష్కరణలు, వ్యవస్థాపకత స్వయం ఉపాధి వైపు నడిపించడంలో అధ్యాపకుల పాత్ర కీలకమని తెలిపారు. కాలేజ్ ఆఫ్ సైన్సెస్ ప్రిన్సిపల్ ఆచార్య పద్మావతి, వైజాగ్ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈఓ రవి ఈశ్వరపు, ఆచార్య హేమ, ఆచార్యులు కేవీ సుచరిత, బాలాజీ, రాజశేఖర్, వంశీ రాయల బృందం పాల్గొంది.

## అటవీ ప్రాంతాల్లో చెరువుల పునరుద్ధరణకు చర్యలు

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లాతో పాటు అటవీ ప్రాంతాల్లో శతాబ్దానికి పైగా చరిత్ర కలిగిన చిన్న నీటిపారుదల చెరువుల మరమ్మతులు, పునరుద్ధరణ, పునరుజ్జీవన పనులు చట్టప్రకారం చేపడుతున్నట్లు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పులశాఖ సహాయమంత్రి కీర్తివర్ధన్ సింగ్ చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఈ పనులను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అటవీ శాఖలే నిబంధనలకు అనుగుణంగా చేపడుతున్నాయని తెలిపారు.

# న్యాయం అడిగితే లాఠీ ఛార్జ్ చేస్తారా జంగాల అజయ్ కుమార్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

**గుంటూరు, పెన్ పవర్, జులై, 21 :** నీట్ పేపర్ లీక్ చేసిన వారిపై చర్యలు తీసుకొవాలని,కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధాని ఢిల్లీలో జంతర్ మంతర్ వేదికగా నిరసన కార్యక్రమాలు జరుగుతున్న క్రమంలో నిన్న విద్యార్థులపై అత్యంత క్రూరంగా లాఠీ ఛార్జ్,బాష్పవాయు ప్రయోగం జరగడాన్ని తీవ్రంగా ఖండిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ గుంటూరు నగర సమితి ఆధ్వర్యంలో ఈరోజు జిన్నా టవర్ సెంటర్లో గల మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఐ గుంటూరు నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ అధ్యక్షత వహించగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజ్ వలన లక్షలాదిమంది విద్యార్థులు ఆందోళనకు గురై మానసిక ఒత్తిడికి లోనైనారని తట్టుకోలేక కొంతమంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకుని చనిపోవడానికి ప్రధాన కారకుడు అయినటువంటి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణం రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశ భవిష్యత్తును నిర్మించవలసిన విద్యార్థులు యువకులను తీవ్రవాదులుగా పోల్చుతూ పోలీసులు,వారా మిలటరీ దళాలు శత్రు దేశ సైనికులపై దాడి చేస్తున్నట్టుగా అత్యంత పాసవికంగా దాడి చేయడాన్ని




సిపిఐ తీవ్రంగా ఖండిస్తుందని ప్రశ్నించిన వారిని దేశద్రోహులుగా చూపిస్తూ ఈ విధమైనటువంటి భౌతిక దాడులకు దిగడం భారతదేశ సమాజం చిదరించుకుంటుందని వారన్నారు. సిపిఐ గుంటూరు జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి, నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ మాట్లాడుతూ దేశ రాజధానిలో విద్యార్థులు, యువకులు చేస్తున్నటువంటి పోరాటాన్ని కొంతమంది పేడ్ సోషల్ మీడియా యాక్టివిస్టుల ద్వారా హిందూ మతానికి వ్యతిరేకంగా జరుగుతున్నటువంటి ఉద్యమంగా చూపించే ప్రయత్నం జరుగుతుందని అటువంటి వారికి ఏమాత్రం బుద్ధి ఉన్నట్టుగా లేదని ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నటువంటి నాయకులు, విద్యార్థులకు మద్దతు తెలిపిన వారిని దేశద్రోహులుగా సంఘవిద్రోహశక్తులుగా ప్రచారం చేస్తున్నారని కళ్ళ ముందు లక్షలాదిమంది విద్యార్థులకు జరిగినటువంటి అన్యాయం కనిపిస్తున్నటువంటి తరుణంలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఆ ఉద్యమంలో భాగస్వామ్యం అవుతున్న ఈ తరుణంలో ఈ విధమైనటువంటి అసత్యాలు ప్రచారం చేయడం చూస్తా ఉంటే అసత్యాలు మాట్లాడే వారి బుర్రలో మెదడుకు బదులు పేడ ఉన్నట్టుగా అనిపిస్తుందని వారు తీవ్ర స్థాయిలో విమర్శించారు. విద్యార్థుల న్యాయమైన కోర్కెలు తీరేంతవరకు వారి పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలియజేయడమే గాక ఉద్యమాలలో కూడా భాగస్వామ్యం అవుతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి మేడా హనుమంతరావు, నగర కమిటీ సభ్యులు నూతలపాటి చిన్న, జంగాల చైతన్య, చల్ల మరియదాసు, మంగ శ్రీనివాసరావు, ధూపాటి వెంకటరత్నం, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్, సిపిఐ గుంటూరు నగర సమితి సభ్యులు ఆర్టీసీ రాజు, జగన్నాథం, ఆకిటి సుశీల, రాయల రామారావు, దేగల వెంకటేశ్వర్లు, చంద్రమౌళి అమర్నాథ్, ఖాన్, మత్తే అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే డెంగీ నివారణ : చింతా శేషుబాబు

**వేటపాలెంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవ అవగాహన సదస్సు**



**వేటపాలెం, పెన్ పవర్, జూలై 21:** డెంగీ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా వేటపాలెంలోని సర్వోదయ కాలనీలో మంగళవారం డెంగీ, మలేరియా తదితర దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీరాల మలేరియా సబ్ యూనిట్ అధికారి చింతా శేషుబాబు పాల్గొని మాట్లాడుతూ, వర్షాకాలంలో డెంగీ, మలేరియా, మెదడువాపు వంటి వ్యాధులు అధికంగా ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, మురికి గుంటలను పూడ్చివేయడం, నీటి తొట్టెలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దోమల లార్వాలను గుర్తించి వెంటనే నిర్మూలించాలని, ప్రతి శుక్రవారం 'డ్రై డే' పాటిస్తూ ఇంటి పరిసరాల్లో నిల్వ నీటిని తొలగించాలని ప్రజలకు సూచించారు. జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని హెల్త్ క్లినిక్ లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో దయామణి, ఎంఎల్‌హెచ్‌పీ శిరోరాణి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# చంద్రబాబు అభివృద్ధి ఆలోచనలు.. జగన్ విధ్వంస విధానాల మధ్య 'స్థానిక' పోరు : ప్రత్తిపాటి

**కూటమి శ్రేణుల ఐక్యత, ప్రజామద్దతుతో వైసీపీ అభ్యర్థులు నామినేషన్ కే వెనుకాడాలి.**

**మైదవోలు, బుక్కాపురం గ్రామాల్లో రూ.23 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రత్తిపాటి.**




**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జూలై 21 యడ్లపాడు :** జగన్.. వైసీపీనేతలు, వారి తొత్తుగా మారిన అవినీతి మీడియా, పేటీఎమ్ బృందం, చిన్నచిన్న విషయాల్ని కూడా గోరంతలు కొండంతలు చేస్తూ అభివృద్ధి నిరోధక శక్తులుగా వ్యవహరిస్తున్నారని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారంలో ఉన్నప్పుడు జే ట్యాక్స్ తో పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తల్ని భయపెట్టిన జగన్.. నేడు తన గోబెల్స్ ముఠా దుష్ప్రచారంతో పెట్టుబడిదారులు, పెట్టుబడుల్ని అడ్డుకుంటూ, చంద్రబాబు... లోకేశ్ ల కష్టాన్ని నీరుగార్చే ప్రయత్నాల్ని నిరంతరం కొనసాగిస్తున్నాడని ప్రత్తిపాటి అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం యడ్లపాడు మండలం మైదవోలు, నాదెండ్ల మండలం బుక్కాపరం గ్రామాల్లో పర్యటించిన ప్రత్తిపాటి, స్థానిక నాయకులతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రత్తిపాటి శంకుస్థాపన చేశారు. తొలుత బుక్కాపురంలో రూ.13 లక్షల



సర్వశిక్షా అభియాన్ నిధులతో నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపనచేసిన ప్రత్తిపాటి, అనంతరం మైదవోలులో రూ.10 లక్షలతో నిర్మించే బీసీ సామాజిక భవనానికి, ఎస్సీ, బీసీ శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం రెండు గ్రామాల్లో ప్రజల్ని ఉద్దేశించి మాట్లాడారు.

**చంద్రబాబు అభివృద్ధి, జగన్ విధ్వంసం మధ్యే 'స్థానిక' పోరు :** కూటమిలో ప్రధాన పక్షమైన తెలుగుదేశం.. మిత్ర పక్షాలైన జనసేన, బీజేపీలతో ఉన్న మైత్రి బంధాన్ని మరింత బలపరుచుకోవాలని, వ్యక్తిగత ప్రయోజనాల కంటే వ్యవస్థల పటిష్టతకే శ్రేణులు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రత్తిపాటి సూచించారు. అభిప్రాయబేధాలు.. మాట పట్టింపుల్ని పక్కన పెట్టి. మూడుపార్టీల శ్రేణులు ఐక్యంగా, సమిష్టిగా పనిచేస్తే గొడ్డలిపార్టీ శాశ్వతంగా కనుమరుగు అవుతుందన్నారు. జగన్ దృష్టి, ఆలోచనలు ఎప్పుడూ ప్రజల్ని, రాష్ట్రాన్ని ఎలా నాశనం చేయాలనే కోణంలోనే ఉంటాయని, ఈ వాస్తవాన్నిఇప్పటికే ఏపీ వాసులు గ్రహించారని ప్రత్తిపాటి చెప్పారు. చంద్రబాబు అభివృద్ధికి, జగన్ విధ్వంసానికి మధ్య ఉన్నతేడా ప్రజలకు పూర్తిగా అర్థమైందని, త్వరలో జరిగే స్థానిక ఎన్నికలు ఈ రెండు అంశాల రెఫరెండంగానే ఉంటాయన్నారు. రెండేళ్లలో ఏ రాష్ట్రానికి సాధ్యం కాని అభివృద్ధి, సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం ప్రజలకు అందించిందని, దాంతో వారి నమ్మకం, విశ్వాసం పెరిగాయన్నారు. ప్రజల మనసుల్లో కూటమిపార్టీలపై ఉన్న సానుకూలత, సదభిప్రాయాన్ని స్థానిక ఎన్నికల్లో శ్రేణులు గొప్ప విజయంగా మలచాలని ప్రత్తిపాటి సూచించారు. కూటమి శ్రేణుల ఐక్యతతో వైసీపీ అభ్యర్థులు నామినేషన్ వేయడానికే వెనకడుగు వేసే పరిస్థితులు రావాలన్నారు. కుట్రలు, కుతంత్రాలు తప్ప ప్రజలు, రాష్ట్రం గురించి ఆలోచించని వైసీపీకి ఎప్పటికీ ప్రజాదరణ లభించదని ప్రత్తిపాటి తేల్చిచెప్పారు. మంత్రి నారాలోకేశ్ విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టి, సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని, వాటి ఫలితాలనే నేడు విద్యార్థులు అనుభవిస్తున్నారని ప్రత్తిపాటి చెప్పారు. ప్రైవేట్ పాఠశాలల్ని తలదన్నేలా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంపై ఉపాధ్యాయులతో పాటు ప్రజలు గర్విస్తున్నారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, జవ్వాజి మధన్ మోహన్, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, బీజేపీ నేతలు మల్లెల శివనాగేశ్వరరావు, నెల్లూరి రంజిత్, టీడీపీ నాయకులు పోపూరి వెంకయ్య, రాఘవయ్య, సిలార్, గేర్ అశోక్, యేసు దాసు, సుభాని, మాడ శ్రీను, సింగయ్య, జయప్రసాద్, నక్క పోతురాజు, నక్క కోటేశ్వరరావు, భాస్కర్, వెంకటేశ్వర్లు, థామస్, ఇంకేశ్వరావు, గ్రామ నాయకులు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇజ్రాయిల్ పేటకు మహర్దశ తీసుకొస్తాం : ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు, పెన్ పవర్, జులై, 21 :** స్థానిక ఇజ్రాయిల్ పేటలోని ప్రతి వీధిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక 22వ డివిజన్లోని ఇజ్రాయిల్ పేట, గాంధీనగర్ ఆర్టీసీ కాలనీ, వెంకటరావు నగర్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే నసీర్ క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో ఎమ్మెల్యే నసీర్ మాటామంతీ కలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ సేవలు ఎలా అందుతున్నాయి ? శానిటేషన్ సక్రమంగా ఉందా ? వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కనీసం అభివృద్ధికి నోచుకోని ఇజ్రాయిల్ పేటలో రోడ్లు డ్రెయిన్ల నిర్మాణాన్ని మరో 15 నుంచి 20 రోజుల్లో చేపట్టనున్నామని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. ఇప్పటికే గుంటూరు తూర్పు నియోజకవర్గంలో సుమారు 100 కోట్ల రూపాయలతో అన్ని ప్రాంతాలలో రోడ్లు, డ్రెయిన్లు, వాటర్ పైప్ లైన్ల నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న పనులు వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించబోతున్నామని అన్నారు. ప్రజలకు తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నామని, క్షేత్రస్థాయిలో ఏ సమస్య వచ్చినా కూటమి నాయకుల వద్దకుగానీ, తన వద్దకుగానీ వచ్చి సంప్రదించవచ్చని ప్రజలకు సూచించారు. కూటమి ప్రభుత్వం అంటేనే అభివృద్ధికి బ్రాండ్ మార్క్ అనిని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ స్పష్టం చేశారు.

# మహిళల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

**గుంటూరు,పెన్‌పవర్, జులై 21:** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మంగళవారం నిర్వహించిన మహిళా గ్రీవెన్స్ కార్యక్రమంలో మహిళల నుంచి పలు వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు స్థల వివాదాలు, పెన్షన్లు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల జారీ, సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.



సిరిపురపు అనురాధ అనే మహిళ తన రేషన్ కార్డులో కారు ఉన్నట్లు నమోదైందని, దానివల్ల సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటూ ఆ నమోదును తొలగించాలని కోరారు. మరో మహిళ కుటుంబ ఆర్థిక పరిస్థితిని వివరించి ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేయగా, ఇంకొకరు టిడ్కో ఇల్లు మంజూరు చేయాలని కోరారు. శ్రీనివాసరావుపేటకు చెందిన మహిళ జీవనోపాధి కోసం తోపుడు బండి మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఏటి అగ్రహారం 4వ లైన్‌కు చెందిన మహిళ తమ పొరుగు ఇంటి యజమాని ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు తమ ఇంటి కార్యకలాపాలు కూడా కనిపించే విధంగా ఉన్నాయని, దీనివల్ల గోప్యతకు భంగం కలుగుతోందని ఫిర్యాదు చేశారు. ఈ అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీ ఇచ్చారు. వినతులన్నింటినీ పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. అదేవిధంగా భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థల విజయాలకు ప్రతీకగా నిలిచిన స్కైరూట్ ఏరోస్పేస్ పంపిన ప్రైవేట్ రాకెట్ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ ఇంజినీర్‌గా భాగస్వామ్యమైన గుంటూరుకు చెందిన కుటుంబరాయుడు పూరుబండిని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అభినందించారు. ఆయన సాధించిన విజయంపై హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు స్టాంప్ రైటర్ల ప్రతినిధులు ఎమ్మెల్యే గళ్ళా మాధవిని కలిసి తమ వృత్తికి సంబంధించిన సమస్యలను వివరించారు. ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించి జీవనోపాధికి భరోసా కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు ప్రతి బాలుడికి చేరేలా అధికారులు కృషి చేయాలి : రాష్ట్ర బాలల హక్కుల చైర్మన్ సూర్యనారాయణ రాజు





**విజయవాడ, పెన్ పవర్,జులై,21 :** జిల్లా కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "బాలల సంరక్షణ అంశాలు -- బాల న్యాయ వ్యవస్థ అమలుపై" జిల్లా స్థాయి సమీక్షా సమావేశం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి ఏవీఎన్ సూర్యనారాయణ రాజు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ, కమిషన్ సభ్యులు చల్లా మధుసూదనరావు, వి.గాంధీబాబు పాల్గొని జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల అమలును సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి ఏవీఎన్ సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి బాలుడికి విద్య, వైద్యం, భద్రత, పోషకాహారం వంటి ప్రాథమిక హక్కులు సమర్థవంతంగా అందేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ఇందుకోసం రాష్ట్రస్థాయిలో కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ లక్ష్య సాధనలో అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రతి పథకం అర్హులైన బాలలకు చేరేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వికసిత్ భారత్, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనలో బాలల సమగ్ర అభివృద్ధి కీలకమని పేర్కొన్నారు. బాలల విద్య, ఆరోగ్యం, పోషకాహారం కోసం ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నాయని, వాటి ప్రయోజనాలు ప్రతి చిన్నారికి అందేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు ప్రతి 15 రోజులకు ఒకసారి తప్పనిసరిగా రాత్రి బస చేయాలని ఆదేశించారు. వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. పిల్లలకు విద్యతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను కూడా బోధించాలని పేర్కొన్నారు. సెల్‌ఫోన్ వినియోగం వల్ల పిల్లలు మంచి విషయాల కంటే చెడు ప్రభావాలకు గురయ్యే అవకాశాలు ఉన్నందున తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామస్థాయి బాలల సంరక్షణ కమిటీల పనితీరును నిరంతరం సమీక్షించాలని తెలిపారు. గ్రామాల్లో బడి బయట పిల్లలు లేకుండా చూడటం, బాల్య వివాహాలను అడ్డుకోవడం, బాలలపై వేధింపులు, బాల కార్మిక వ్యవస్థ వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ మాట్లాడుతూ, బాలలు దేశ సంపద అని, వారిని భవిష్యత్ మానవ వనరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి శాఖపై ఉందన్నారు. బాలల సమగ్ర అభివృద్ధి ద్వారా సమాజం, రాష్ట్రం, దేశం పురోగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు చల్లా మధుసూదనరావు, వి.గాంధీబాబు మాట్లాడుతూ, ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చిన పిల్లలపై ప్రత్యేక పర్యవేక్షణ అవసరమన్నారు. బడి బయట ఒక్క బాలుడు కూడా ఉండకుండా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అలాగే పిల్లలకు వ్యాక్సినేషన్ పూర్తిస్థాయిలో జరిగేలా చర్యలు తీసుకోవాలని, వసతి గృహాల నుంచి విద్యార్థులను బయటకు పంపే సమయంలో భద్రతా చర్యలు పాటిస్తున్నారా అనే అంశాన్ని కూడా సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి షేక్ రుక్సానా సుల్తానా బేగం, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రాజేశ్వరరావు, సీడబ్ల్యూసీ సభ్యురాలు రాధా మాధవి, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ధనలక్ష్మి, జిల్లా స్వర్ణ గ్రామ--స్వర్ణ వార్డుల అధికారి కె.ఆర్.ఎస్.ఆర్. రవికుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ కారిడార్ అభివృద్ధికి ప్రణాళికాబద్ధమైన చర్యలు : కమిషనర్ కె.మయూర్ అశోక్ .

**గుంటూరు, పెన్ పవర్, జులై, 21 :** మంగళవారం కమిషనర్ నగరంలోని కెవిపీ కాలనీ మెయిన్ రోడ్, చిలకలూరిపేట రోడ్, ఏటి అగ్రహారం మెయిన్ రోడ్, ఏటుకూరు రోడ్, నందివెలుగు రోడ్, పొన్నూరు రోడ్, అమరావతి రోడ్ తదితర ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పోరేషన్ (ఏపీజిబిసి) అధికారులు, జిఎంసి ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులతో కలిసి పర్యటించి రోడ్ కారిడార్ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో దశల వారీగా మెయిన్ రోడ్లను ఎవెన్యూ ప్లాంటేషన్, డివైడర్లు, క్రమబద్ధమైన ఫుట్ పాత్, లైటింగ్, సైన్ బోర్డ్ ల ఏర్పాటుతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దనున్నామని తెలిపారు. ఇప్పటికే ఏపీజిబిసి రూపొందించిన అభివృద్ధి ప్రతిపాదనలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, తగు మార్పులు తెలిపామని, వాటిని సరి చేసి త్వరితగతిన అందించాలని తెలిపామన్నారు. సదరు



ఎంపిక చేసిన రోడ్లలో గుంటూరు నగర వాతావరణానికి తగిన మొక్కలను నాటేలా, వాటి నిర్వహణ కూడా చేసేలా కాంట్రాక్ట్ నిబంధనలు ఉండేలా చూడాలన్నారు. అనంతరం ఆయా రోడ్ల వెంబడి డ్రైన్, ఫుట్ పాత్ ఆక్రమణలను గమనించి, సంబందిత ప్లానింగ్ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 2 రోజుల్లో జిఎంసి మెయిన్ ఆఫీస్ నుండి కలెక్టరేట్ వరకు రోడ్లకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను పూర్తిగా తొలగించాలని స్పష్టం చేశారు. అలాగే ప్రతి సచివాలయం పరిధిలో నిర్మాణ సామాగ్రి రోడ్లపై ట్రాఫిక్ కి అడ్డుగా వేస్తున్నారని, అటువంటి మెటీరియల్ వారంతట వారు తొలగించుకోకుంటే సీజ్ చేయాలని ఆదేశించారు. పర్యటనలో సిటీ ప్లానర్ రాంబాబు, డిసిపి సూరజ్ కుమార్, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఏసిపీ జకిరా, ఏడీహెచ్ శాంతి, డిఈఈలు శ్రీనివాస్, హనీఫ్, వెంకటరమణ, చైతన్య, ఏపీజిబిసి జనరల్ మేనేజర్ దయాకర్ బాబు, జోనల్ మేనేజర్ బేబి, హార్టికల్చరల్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సంచార జాతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎమ్మెల్యే విజయశ్రీ



**నాయుడుపేట, పెన్ పవర్, జూలై 21 :** ఎన్నో ఏళ్లుగా శాశ్వత నివాసాలు లేకుండా ఇబ్బందులు పడుతున్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయ శ్రీ పేర్కొన్నారు. నాయుడుపేట పట్టణంలోని అంబేద్కర్ భవనంలో సంచార జాతుల వారితో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీ మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, అధికారులతో కలసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సంచార జాతుల వారు వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్న క్యాంటిన్ సమీపంలో సంచార జాతుల వారికి దుకాణాలు ఏర్పాటు చేసి వారికి అండగా ఉంటామని అర్హులైన ప్రతి ఒక్కరికి నివాస స్థలాలు ఇప్పించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్ల, అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు, ఆర్ఐ సాయితేజ, టీడీపీ పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, టిడిపి నాయకులు కట్ట రమణ రెడ్డి , నాయకులు పసల గంగప్రసాద్, పొట్లపూడి రాజేష్, నానబాల సుబ్బారావు, కృష్ణరెడ్డి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

## అనేపూడి, చందనమూడి గ్రామాల్లో ఈ-కేవైసీ తనిఖీ : తహసీల్దార్ రాజేంద్ర

### సంక్షేమ ఫలాలు పారదర్శకంగా అందేందుకే ఈ-కేవైసీ

### క్షేత్రస్థాయిలో రికార్డులను పరిశీలించిన రెవెన్యూ యంత్రాంగం!

**దొరవారిసత్రం, పెన్ పవర్, జూలై 21 :** మండల పరిధిలోని అనేపూడి మరియు చందనమూడి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పర్సనల్ డేటా ఈ-కేవైసీ నమోదు మరియు పరిశీలన ప్రక్రియను దొరవారిసత్రం తహసీల్దార్ రాజేంద్ర క్షేత్రస్థాయిలో నేరుగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులతో కలిసి లబ్ధిదారుల రికార్డులను తహసీల్దార్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా, అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందాలనే దృఢ సంకల్పంతోనే ఈ-కేవైసీ ప్రక్రియను వేగవంతం చేసినట్లు తెలిపారు. గ్రామ ప్రజలందరూ తమ ఆధార్ వివరాలతో ఈ-కేవైసీని సకాలంలో పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ-కేవైసీ నమోదు వేళ ఎదురవుతున్న



సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తూ, నిర్దేశిత సమయంలోగా శాతాన్ని పూర్తి చేయాలని సచివాలయ, రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఈ పర్యటనలో స్థానిక రెవెన్యూ అధికారులు, వీఆర్ఓలు, గ్రామ సచివాలయ సిబ్బంది మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## మహిళలపై దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం : కాకాణి పూజిత



**నెల్లూరు, పెన్ పవర్ జూలై 21 :** రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులు, వేధింపులు పెరుగుతున్నాయని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నెల్లూరులో సోమవారం భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. నగరంలోని వీఆర్సీ సెంటర్ వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత నాయకత్వంలో కావలి, నెల్లూరు టౌన్, నెల్లూరు రూరల్ ప్రాంతాలకు చెందిన మహిళా నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నిరసనకారులు "సీఎం డౌన్ డౌన్", "కూటమి ప్రభుత్వం డౌన్ డౌన్" అంటూ నినాదాలు చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మహిళల భద్రత పూర్తిగా ప్రశ్నార్థకంగా మారిందని, మహిళలపై వరుసగా జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, హింసాత్మక ఘటనలను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వారు విమర్శించారు. మహిళల భద్రత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించిన కాకాణి పూజిత, శాంతిభద్రతల పరిరక్షణలో వైఫల్యానికి బాధ్యత వహిస్తూ రాష్ట్ర మహిళా హోం మంత్రి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మహిళా సమాజానికి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని, మహిళల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆమె కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహిళల రక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## శతాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని కందిపాలెం దళితవాడ



### 80 దళిత కుటుంబాల దయనీయ జీవితం

### సీపీఎం సర్వేలో వెలుగుచూసిన వాస్తవాలు

### తక్షణమే అభివృద్ధి చర్యలు చేపట్టాలని అధికారులకు సీపీఎం హెచ్చరిక

### మురుగు కాలువ మధ్యలోనే జీవనం

### పేదలకు సంక్షేమం అందని ద్రాక్షే

### చుట్టూ అభివృద్ధి... మధ్యలో వెనుకబడిన దళితవాడ

**కడప, పెన్ పవర్ జూలై 21 :** నగరానికి అతి సమీపంలోనే ఉన్నప్పటికీ, అభివృద్ధికి మాత్రం శతాబ్దాలుగా దూరంగా మిగిలిపోయిన దళితవాడగా కడప నగరంలోని ఎర్రముక్కపల్లె పరిధిలోని కందిపాలెం నిలిచిందని సీపీఎం నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేలో ఆందోళనకర వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. సుమారు 200 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ దళితవాడలో ప్రస్తుతం 80 కుటుంబాలు కనీస మౌలిక సదుపాయాలు లేక నరకయాతన అనుభవిస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం కందిపాలెం దళితవాడలో సీపీఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ నేతృత్వంలో జిల్లా కమిటీ సభ్యులు కామనూరు శ్రీనివాసులు రెడ్డి, బి. దస్తగిరి రెడ్డి, పట్టణ కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, నరసింహ, తిమ్మయ్య తదితరులతో కూడిన బృందం ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకుంది.

**మురుగు కాలువ మధ్యలోనే జీవనం:** సర్వే సందర్భంగా స్థానికులు తమ దయనీయ పరిస్థితిని బృందానికి వివరించారు. పీఎఫ్ కార్యాలయం సమీపం నుంచి వచ్చే భారీ మురుగు కాలువ తమ ఇళ్ల మధ్యగుండా ప్రవహిస్తూ బుక్కవంకలో కలుస్తోందని, రాత్రివేళల్లో భరించలేని దుర్వాసనతో జీవించడం అసాధ్యంగా మారిందని వాపోయారు. అపరిశుభ్ర వాతావరణం కారణంగా చిన్నారులు, వృద్ధులు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు.

**పేదలకు సంక్షేమం అందని ద్రాక్షే:** దళిత కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత విద్యుత్ బిల్లులు మళ్లీ వసూలు చేస్తున్నారని, పక్షవాతంతో బాధపడుతున్న వృద్ధులకు సదరం ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా అధికారులు కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని ఆరోపించారు.

**చుట్టూ అభివృద్ధి... మధ్యలో వెనుకబడిన దళితవాడ:** కందిపాలెం చుట్టూ ఉన్న ఎర్రముక్కపల్లె ప్రాంతం ధనికులు, ఎగువ మధ్యతరగతి ప్రజల నివాస ప్రాంతంగా వేగంగా అభివృద్ధి చెందగా, మధ్యలో ఉన్న కందిపాలెం మాత్రం ఇప్పటికీ ఇరుకైన సందులు, మట్టి దారులు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లతోనే కాలం గడుపుతోందని సీపీఎం నేతలు పేర్కొన్నారు. పక్కా గృహాలు, రహదారులు, డ్రైనేజీ, ఇతర మౌలిక సదుపాయాలు ఇప్పటికీ అందని ద్రాక్షగానే మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

**అధికారులు వెంటనే స్పందించాలి:** కడప నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు తక్షణమే కందిపాలెంలో పర్యటించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి అభివృద్ధి పనులు ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. దళితవాడ అభివృద్ధిపై ప్రభుత్వం, కార్పొరేషన్ నిర్లక్ష్యం కొనసాగితే స్థానిక ప్రజలతో కలిసి కడప నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నిరసన ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అభివృద్ధి నగరాల మధ్యలోనే ఇంకా ఇలాంటి దళితవాడలు కనీస సౌకర్యాలకు నోచుకోకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఓడీఓపీ కింద నెల్లూరు ఉత్పత్తులకు ప్రాధాన్యం

### పార్లమెంటులో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద సమాధానం

### ఉదయగిరి చెక్క వస్తువులు, పాటూరు చీరలకు ప్రత్యేక గుర్తింపు

### గ్లోబల్ మార్కెటింగ్, ఎగుమతుల ప్రోత్సాహకంపై కేంద్రం స్పష్టత



**కోవూరు పెన్ పవర్ జులై 21 :** దేశంలో ప్రతి జిల్లా కేంద్రంగా స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ప్రవేశపెట్టిన 'వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్' (ఓడిఓపీ ) పథకం కింద శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు సంబంధించిన వివరాలపై నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పార్లమెంటులో పలు ప్రశ్నలు లేవనెత్తారు. నెల్లూరు జిల్లా నుంచి ఉత్పత్తుల ఎంపిక, వాటి ఉత్పత్తి, విక్రయాలు, ఉపాధి కల్పన, ఎగుమతులకు కేంద్రం అందిస్తున్న సహాయంపై ఎంపీ అడిగిన ప్రశ్నలకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయమంత్రి జితిన్ ప్రసాద మంగళవారం పార్లమెంటులో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఎంపీ అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ... ఆంధ్రప్రదేశ్‌లోని 26 జిల్లాల నుంచి మొత్తం 99 ఉత్పత్తులను (26 ప్రాథమిక, 26 ద్వితీయ, 21 తృతీయ, 26 కేటగిరీ ఉత్పత్తులు) ఓడీఓపీ కింద గుర్తించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. నెల్లూరు జిల్లా నుంచి ప్రాథమిక ఉత్పత్తిగా ఉదయగిరి చెక్క భోజన సామగ్రి (ఉదయగిరి స్పూన్లు/చెక్క వస్తువులు)ని, ద్వితీయ ఉత్పత్తిగా పాటూరు కాటన్ సిల్క్ చీరలను ఓడీఓపీ పథకం కింద గుర్తించినట్లు కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. ఓడీఓపీ కింద గుర్తించిన ఉత్పత్తుల ప్రచారం, విక్రయాల కోసం ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రదర్శనలు, ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. దేశీయంగా, అంతర్జాతీయంగా నిర్వహిస్తున్న ప్రదర్శనల్లో ఈ ఉత్పత్తుల ప్రదర్శనకు అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించిన సమాచారం ప్రకారం, పాయకరావుపేట పట్టు చీరల తయారీలో సుమారు 100 మంది చేనేత కార్మికులు నిమగ్నమై ఉన్నారని, ఓడీఓపీ కింద గుర్తించిన తర్వాత రూ.10.08 కోట్ల విలువైన ఉత్పత్తి నమోదైనట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. ఓడీఓపీ ఉత్పత్తుల విక్రయాలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వ ఇ-మార్కెట్‌ప్లేస్ పోర్టల్‌లో 'జీఈఎం -ఓడిఓపి బజార్'ను ఏర్పాటు చేసి, ఆన్‌లైన్ ద్వారా డిజిటల్ మార్కెటింగ్ సౌకర్యం కల్పించినట్లు వివరించారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, విదేశాల్లోని భారతీయ రాయబార కార్యాలయాల ద్వారా అంతర్జాతీయ కొనుగోలుదారులు-అమ్మకందారుల సమావేశాలు నిర్వహిస్తున్నామని, భారతదేశంలో జరిగే అంతర్జాతీయ, బహుళపక్ష సమావేశాల్లో ఓడీఓపీ ఉత్పత్తులను ప్రత్యేక బహుమతులుగా అందిస్తూ అంతర్జాతీయంగా గుర్తింపు తెస్తున్నట్లు చెప్పారు. అలాగే జాతీయ చేనేత అభివృద్ధి పథకం కింద జాతీయ, రాష్ట్ర స్థాయి ఎక్స్‌పోలు నిర్వహిస్తూ చేనేత రంగానికి మార్కెటింగ్ మద్దతు ఇస్తున్నామని, హ్యాండ్లూమ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (హేపీసీ ) సహకారంతో ఎగుమతికి తగిన ఉత్పత్తులను గుర్తిస్తున్నట్లు తెలిపారు. ఎగుమతుల ప్రోత్సాహంలో భాగంగా, మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎంపీడా ) సమాచారం ప్రకారం.. 2024 ఆర్థిక సంవత్సరంలో దేశం మొత్తం రూ.71,070 కోట్ల (7.38 బిలియన్ అమెరికన్ డాలర్లు) విలువైన సీఫుడ్ ఎగుమతుల్లో, విశాఖపట్నం పోర్టు నుంచే రూ.21,090 కోట్ల (2.19 బిలియన్ అమెరికన్ డాలర్లు) విలువైన ఎగుమతులు జరిగాయని కేంద్ర మంత్రి వివరించారు. యాంటీబయాటిక్ రహిత నాణ్యమైన ఆక్వాకల్చర్ ఉత్పత్తులకు ఎంపెడా షాఫారీ (షఫరీ ) సర్టిఫికేషన్‌ను అర్హులైన హేచరీలు, ఫీడ్ యూనిట్లకు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే సంప్రదాయ మత్స్యకారులకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ( పిఎంఎం ఎస్ వై ) పథకం కింద పడవలు, వలలు అందించడం, సముద్రపాచి సాగు యూనిట్ల ద్వారా స్వయం సహాయక బృందాలను (షగ్స్ ) ప్రోత్సహించడం వంటి చర్యలు కూడా చేపడుతున్నట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఓడీఓపీ పథకం కింద మరిన్ని ఉత్పత్తులను చేర్చేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ప్రస్తుతం ఎలాంటి కొత్త ప్రతిపాదనలు అందలేదని కేంద్ర మంత్రి వెల్లడించారు.

## ఆఫీస్ తెరిచే ఉంది.... అధికారులు మాయం!

### సైదాపురం తహశీల్దార్ కార్యాలయంలో ఖాళీ కుర్చీలు

### ప్రజలు గంటల తరబడి నిరీక్షణ



**గూడూరు, పెన్ పవర్, జూలై 21:** ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాల్సిన సైదాపురం మండల తహశీల్దార్ కార్యాలయంలో అధికారులు, కింది స్థాయి సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయ పని వేళల్లో కూడా టేబుళ్లు, కుర్చీలు ఖాళీగా కనిపిస్తుండగా, ఫైళ్లు మాత్రం కుప్పలుగా పేరుకుపోయాయి. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు సహా ఇతర రెవెన్యూ సేవల కోసం మండలంలోని మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు గంటల తరబడి వేచి చూసినా సంబంధిత సిబ్బంది అందుబాటులోకి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తమ పనులు రోజుల తరబడి ఆలస్యమవుతున్నాయని వాపోతున్నారు. ప్రత్యేకించి వీఆర్వోలు, ఇతర కింది స్థాయి సిబ్బంది కార్యాలయంలో లేకపోవడంతో ప్రజలకు సరైన సమాచారం కూడా అందడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. తహశీల్దార్ ఫోన్‌కు స్పందిస్తున్నప్పటికీ, కింది స్థాయి సిబ్బంది ఫోన్లు ఎత్తడం లేదని, ప్రజల సందేహాలకు సమాధానం ఇవ్వడం లేదని బాధితులు చెబుతున్నారు. ప్రజా సేవలే లక్ష్యమని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో వెనుకబడిన మెట్ట ప్రాంతమైన సైదాపురం మండల రెవెన్యూ కార్యాలయంలో నెలకొన్న ఈ పరిస్థితిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. కార్యాలయ సిబ్బంది విధి వేళల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుని, ప్రజలకు సకాలంలో సేవలు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## మాటలు కాదు.. చేతల్లో చూపిస్తున్నాం

### మెగా జాబ్ మేళాలో ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్





**గూడూరు, పెన్ పవర్, జూలై 21:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ( ఏ పి స్కిల్ డవలెప్మెంట్) ఆధ్వర్యంలో గూడూరులోని ఐ=ఔ డిఆర్ డబ్ల్యు డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 291 మంది నిరుద్యోగ యువత ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మొత్తం 24 ప్రముఖ కంపెనీలు పాల్గొనగా, 401 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరిలో 291 మందికి నియామక ఉత్తర్వులు అందజేయగా, మరో 24 మందిని తదుపరి ఇంటర్వ్యూకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గూడూరు ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాశిం సునీల్ కుమార్ మాట్లాడుతూ, యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల హామీ అమలులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు అర్హతను బట్టి నెలకు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం లభిస్తుందని చెప్పారు. గత రెండేళ్లలో గూడూరు నియోజకవర్గంలో నాలుగు మెగా జాబ్ మేళాలు, ఏడు మినీ జాబ్ మేళాలు నిర్వహించి సుమారు 1,200 మందికి ఉపాధి కల్పించామని ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వంలా మాటలకే పరిమితం కాకుండా, చేతల్లో చూపించే ప్రభుత్వమిదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అండ్ స్కిల్ ఆఫీసర్ ఎం. వినయ్ కుమార్, సెట్నెల్ సీఈఓ ఎ. నాగేశ్వరరావు, తిరుపతి జిల్లా పార్లమెంట్ అధికార ప్రతినిధి అబ్దుల్ రహీం, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి. చెంచు రామయ్య, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూం, వైటీసీ మేనేజర్ ఎం. బాలాజీ, బిఆర్ డబ్ల్యు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఈ.పీ. హనుమంతరావు, వైస్ ప్రిన్సిపాల్ పి. గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## డ్వాక్రా సంఘాల సమస్యల పరిష్కారానికి కృషి

### తిరుపతిలో ఆర్పీలతో సమావేశమైన డాక్టర్ పనబాక లక్ష్మి







**తిరుపతి, పెన్ పవర్ జూలై 21 :** మహిళల ఆర్థిక స్వావలంబనకు డ్వాక్రా సంఘాలు వెన్నెముకగా నిలుస్తున్నాయని, సంఘాల బలోపేతంతో పాటు ఆర్పీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు డాక్టర్ పనబాక లక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం తిరుపతి పార్లమెంట్ కార్యాలయంలో క్లస్టర్--1 పరిధిలోని 2, 3, 4, 12 వార్డులకు చెందిన డ్వాక్రా సంఘాల ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్పీలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, స్థానిక పరిస్థితులు, సంఘాల నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. డ్వాక్రా సంఘాలు మహిళా సాధికారతకు బలమైన వేదికలని పేర్కొన్న డాక్టర్ పనబాక లక్ష్మి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ఆర్పీలు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ కోసం పరస్పర సహకారంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జి ఎం. కృష్ణ యాదవ్, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు యశ్వంత్ రెడ్డి, పార్లమెంట్ వ్యవస్థాపక కార్యదర్శి ముని రామయ్య, పార్లమెంట్ కార్యదర్శి రేవతి, క్లస్టర్ నాయకులు, డ్వాక్రా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అర్థం కానీ వైసీపీ స్టాండ్...

**విజయవాడ, జూలై 21 పెన్ పవర్:** దేశంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యల మీద ఎంపీలు వాయిదా తీర్మానం ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. పైగా ఇప్పుడు పార్లమెంట్లో వర్షాకాల సమావేశాలు కూడా మొదలయ్యాయి. ప్రజలు ఎన్నుకున్న పార్లమెంట్ సభ్యులు ప్రజల సమస్యల మీద తమ వాయిస్ వినిపించవచ్చు. ప్రజల బాధలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లొచ్చు. కానీ ఈ విషయంలో వైసిపి వేరే ఆలోచన చేస్తోంది.వైసిపికి ఏపీలో 2024 ఎన్నికల్లో కేవలం 11 స్థానాలు మాత్రమే వచ్చాయి. కనీసం ప్రతిపక్ష హోదాను కూడా అక్కడ ప్రజలు ఇవ్వలేదు. ప్రతిపక్ష హోదా కోసం జగన్ అనేక సందర్భాల్లో దేబిరించారు. అయినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. చివరికి తాను అసెంబ్లీకి వెళ్లడమే మానేశారు. ప్రభుత్వాన్ని నిలదీసే అధికారం ఉన్నప్పటికీ.. ఎందుకనో జగన్ ఆ అవకాశాన్ని వినియోగించుకోలేకపోయారు. 2019 నుంచి 23 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్.. ప్రతిపక్ష టీడీపీకి ఇబ్బందికరమైన వాతావరణం కలిగించారు. కనీసం అసెంబ్లీలో మాట్లాడే స్వేచ్ఛను కూడా ఇవ్వలేకపోయారు. కర్మ రిటర్న్స్ అన్నట్టుగా.. జగన్ కు 11 స్థానాలు రావడంతో కనీసం ప్రతిపక్ష హోదాను కూడా సొంతం చేసుకోలేకపోయారుఏపీలో అసెంబ్లీకి కూడా వెళ్ళని వైసీపీ నేతలు.. పార్లమెంట్లో మాత్రం శాంతి భద్రతల మీద వాయిదా తీర్మానం ఇవ్వడం ఆశ్చర్యంగా ఉంది. వైసీపీ ఎంపీ గురుమూర్తి పార్లమెంటులో ఈ తీర్మానాన్ని ఇచ్చారు. పార్లమెంట్ రూల్ ఆఫ్ బుక్ గురించి అవగాహన ఉన్న ఎవరికైనా సరే ఈ తీర్మానం గురించి వెంటనే ఒక క్లారిటీ వస్తుంది. ఎందుకంటే ఈ తీర్మానం మొదటి క్షణంలోనే విరిగిపోతూ ఉంటుంది. అయినప్పటికీ తాము ఢిల్లీ స్థాయిలో పోరాడుతున్నామని వైసీపీ నేతలు చెప్పడానికి అవకాశం ఉంటుంది. సొంత ఛానల్లో డబ్బాలు కొట్టుకోవడానికి సందర్భం ఉంటుంది.ఇక్కడ వైసిపి నేతలకు తెలియంది ఏంటంటే.. శాంతిభద్రతల వ్యవహారం పూర్తిగా రాష్ట్రాల పరిధిలో ఉంటుంది. భారత రాజ్యాంగం కూడా ఇదే చెబుతోంది. శాంతిభద్రతలను గురించి చర్చించడానికి.. ప్రజలకు మెరుగైన భద్రత కల్పించడానికి అక్కడి ప్రజాప్రతినిధులు ఉంటారు. ఒకవేళ శాంతి భద్రతల విషయంలో ఇబ్బందులు ఎదురవుతుంటే బాధ్యతాయుతమైన ప్రతిపక్షం ప్రభుత్వాన్ని అసెంబ్లీలో నిలదీయాలి.. ఆధారాలతో సహా కడిగిపారేయాలి. ఆ



దమ్ము లేని వైసిపి అసెంబ్లీకి రావడం లేదు. ఏదో గుంపులో గోవిందం లాగా శాంతిభద్రతల వ్యవహారం మీద పార్లమెంట్లో తీర్మానం ఇచ్చింది.ఏపీ అసెంబ్లీలో 11మంది మాత్రమే ఉన్నారు కాబట్టి వైసిపి నేతలకు మైక్ దొరికే అవకాశం లేదు. ఒకవేళ దొరికితే మాట్లాడే దమ్ము వారి దగ్గర లేదు. ఒకవేళ మాట్లాడినా కూటమి ఎమ్మెల్యేలు లెక్కలతో సహా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## డిజిటల్ లూప్‌లో వైసీపీ - రాజకీయాల్లో రాత మారుతుందా?

**విజయవాడ, జూలై 21 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గత సార్వత్రిక ఎన్నికల ఓటమి తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న వ్యూహాలు ఇప్పుడు సరికొత్త చర్చకు దారితీశాయి. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇటీవల పూర్తిగా డిజిటల్ పాలిటిక్స్ వైపే మొగ్గు చూపుతున్నట్లు స్పష్టమవుతోంది. సొంత యాప్స్, టెక్నాలజీతో మన రాత మారిపోతుంది, కేడర్ అంతా డిజిటల్ వేదికలపై యాక్టివ్ కావాలి అని జగన్ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయడం.. క్షేత్రస్థాయి రాజకీయాలను విస్మరించి క్యాడర్‌ను మభ్యపెట్టడమేనా అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల నుండి వస్తున్నాయి. కేవలం డిజిటల్ ప్రచారం, సొంత యాప్‌ల సృష్టి ద్వారా ఒక ప్రాంతీయ పార్టీ ప్రతిపక్ష హోదాలో ఎంతవరకు మైలేజ్ సాధించగలదనే అంశంపై భిన్నాభిప్రాయాలువ్యక్తమవుతున్నాయి. ఆధునిక రాజకీయాల్లో సోషల్ మీడియా, డిజిటల్ ప్రచారాల ప్రాధాన్యత పెరిగిన మాట వాస్తవమే. అయితే, వైఎస్సార్‌సీపీ ప్రస్తుతం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఎక్స్‌టర్నల్ ప్లాట్‌ఫారమ్‌లలో వారి కంటెంట్‌కు ఆశించిన స్థాయిలో రీచ్ రాకపోవడం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసులు, కఠిన నిబంధనల కారణంగా పాత తరహా ప్రచారం నెమ్మదించింది. సాంప్రదాయ సోషల్ మీడియా సంస్థలు మన కంటెంట్‌ను నియంత్రించలేవని చెప్తూ.. పార్టీ కోసం ప్రత్యేకంగా సొంత యాప్‌లు, ఇన్–హౌస్ కమ్యూనికేషన్ టూల్స్ క్రియేట్ చేయడంపై జగన్ ఫోకస్ పెట్టారు. కానీ, ఈ డిజిటల్ గోడల మధ్య జరిగే ప్రచారం కేవలం సొంత డబ్బా లాగా మారి, కేవలం వైఎస్సార్‌సీపీ అభిమానులకే పరిమితం అవుతుందే తప్ప, తటస్థ ఓటర్లలోకి చొచ్చుకెళ్లే అవకాశం చాలా తక్కువని అభిప్రాయపడుతున్నారు.రాజకీయాల్లో డిజిటల్ ప్రచారం అనేది ఎప్పుడూ క్షేత్రస్థాయి పోరాటాలకు ఒక సపోర్టింగ్ టూల్ మాత్రమే కావాలి కానీ, అదే ప్రధాన ప్రత్యామ్నాయం కాలేదు. వైఎస్ జగన్ గతంలో అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం సుదీర్ఘమైన పాదయాత్ర, క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకం కావడం. కానీ, ప్రస్తుత ప్రతిపక్ష హోదాలో వైఎస్సార్‌సీపీ రాజకీయాలు ఇంకా రోడ్ల మీదికి, ప్రజల మధ్యకు చేరడం లేదనేది బహిరంగ రహస్యం. ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో లాఠీ దెబ్బలు తింటూ, జైళ్లకు వెళ్తూ ధర్నాలు చేయకుండా.. కేవలం ఏసీ రూముల్లో కూర్చుని ట్వీట్లు , ప్రెస్ మీట్లు, యాప్‌లలో అప్‌డేట్లకు పరిమితం కావడం వల్ల మైలేజ్ రావడం కష్టమని సోషల్ మీడియా ట్రెండ్స్ చెబుతున్నాయి.ఈ డిజిటల్ పాలిటిక్స్ వల్ల క్యాడర్ అంతర్గతంగా ఒక తప్పుడు భరోసాలో ఉండిపోయే ప్రమాదం ఉంది. యాప్‌లలో బటన్ నొక్కితే ప్రచారం జరిగిపోతుంది.. రాత మారిపోతుంది అని అధినేత చెప్పడం వల్ల.. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం నిలబడే సాధారణ కార్యకర్తల్లో కదలిక తగ్గుతుంది. ప్రతిపక్షంలో ఉన్న పార్టీ ప్రజల కోసం రోడ్లపైకి వచ్చి పోరాడనప్పుడు, ప్రజల్లో ఆ పార్టీపై నమ్మకం సడలుతుంది. డిజిటల్ స్క్రీన్లపై కనిపించే గ్రాఫిక్స్, హాష్‌ట్యాగ్‌లు ఓట్లుగా మారవనే చేదు నిజం 2024 ఎన్నికల్లోనే స్పష్టమైంది. జనాల్లోకి వెళ్లకుండా కేవలం డిజిటల్ పోరాటాలకే ప్రాధాన్యత ఇస్తే.. అది కేవలం పార్టీ శ్రేణులను తాత్కాలికంగా మభ్యపెట్టడానికే ఉపయోగపడుతుంది.డిజిటల్ మీడియా ద్వారా ప్రభుత్వంపై విమర్శలు చేయడం సులువే కానీ, నేరుగా ప్రజల కష్టాల్లో భాగస్వామ్యం కాకపోతే ఆ మైలేజ్ వల్ల లాభం శూన్యం. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎప్పుడూ తమ కోసం రోడ్డుపై నిలబడే నాయకుడినే గుర్తిస్తారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు సైతం ఫీల్డ్ వదిలేసి కేవలం ప్రెస్ మీట్లకే పరిమితం కావడం పార్టీ గ్రాఫ్‌ను మరింత దెబ్బతీస్తోంది. కొత్త యాప్‌ల ద్వారా కేడర్‌ను అనుసంధానించవచ్చు కానీ, అది జనాల్లోకి వెళ్లేందుకు కేవలం ఒక మార్గమే కావాలి. డిజిటల్ వ్యూహాలు పార్టీ అంతర్గత సమన్వయానికి , అర్బన్ ఓటర్లను ఆకర్షించడానికి కొంతవరకు మేలు చేయవచ్చు. కానీ ఆంధ్రప్రదేశ్ లాంటి వైవిధ్యమైన రాజకీయ వాతావరణం ఉన్న రాష్ట్రంలో సొంత యాప్స్ పాలిటిక్స్ ఓట్ల రాతను మార్చలేవు. వైఎస్సార్‌సీపీ తిరిగి పుంజుకోవాలంటే డిజిటల్ స్క్రీన్లను దాటి, ప్రజల గడప తొక్కాల్సిందే. క్షేత్రస్థాయి పోరాటాల నుంచి వచ్చే అసలైన పొలిటికల్ మైలేజ్‌కు, డిజిటల్ ప్రపంచంలో వచ్చే తాత్కాలిక వ్యూస్‌కు చాలా తేడా ఉంటుందనే విషయాన్ని గ్రహించకపోతే.. వైఎస్సార్‌సీపీ డిజిటల్ లూప్‌లోనే ఉండిపోయే ప్రమాదం ఉందన్నది రాజకీయ నిపుణుల అభిప్రాయం.

## ఫీల్డ్ టూర్లకే బాబు ప్రాధాన్యం
## కుర్రాళ్లతో పోటీ పడే ఫిట్ నెస్ సొంతం


**విజయవాడ, జూలై 21పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజకీయ ప్రస్థానాన్ని, ఆయన గత పరిపాలనా విధానాన్ని చూసిన వారికి ప్రస్తుతం ఆయన పనితీరు చూస్తున్న వారికి స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. గతంలో చంద్రబాబు అనగానే ఐటీ, కంప్యూటర్లు, పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్లు, సచివాలయంలో అర్ధరాత్రి దాటే వరకు సాగే సుదీర్ఘ సమీక్షా సమావేశాలు గుర్తొచ్చేవి. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయన తన శైలిని పూర్తిగా మార్చేసుకున్నారు. ఫైల్స్ చూసే సీఎం స్థానంలో ఇప్పుడు వారానికి రెండు, మూడు జిల్లాల్లో పర్యటిస్తూ నేరుగా జనం మధ్యకు వెళ్లే ఫీల్డ్ సీఎం గా దర్శనమిస్తున్నారు. సచివాలయం ఏసీ గదుల కంటే ప్రజాక్షేత్రమే పాలనకు అసలైన వేదిక అని ఆయన రుజువు చేస్తున్నారు.ఈ మార్పు వెనుక బలమైన వ్యూహం, అంతకంటే మిన్నగా ప్రజలతో నేరుగా మమేకం కావాలనే తపన స్పష్టంగా కనిపిస్తున్నాయి. కేవలం విధానాల రూపకల్పనతో సరిపెట్టకుండా, క్షేత్రస్థాయిలో వాటి అమలు తీరును స్వయంగా పరిశీలించడమే లక్ష్యంగా ఆయన తన షెడ్యూల్‌ను మార్చుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా ఆర్థర్ కాటన్ బ్యారేజ్ గేట్ల పరిశీలన నుంచి రాయలసీమ లోని కుప్పం, నెల్లూరు, కడప జిల్లాల పర్యటనల వరకు.. స్వయంగా వెళ్లి పెన్షన్ల పంపిణీ చేయడం, పట్టాల పంపిణీ, స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం ద్వారా పరిపాలనను ప్రజల ముంగిటకు తీసుకెళ్తున్నారు. అధికారులతో సుదీర్ఘ సమీక్షలను గణనీయంగా తగ్గించి, ఆ సమయాన్ని జనం మధ్య గడపడానికి కేటాయించడం క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని సైతం పరుగులు పెట్టిస్తోంది.వయసు రీత్యా చూస్తే ఈ వయసులో ఈ తరహా సుడిగాలి పర్యటనలు చేయడం ఎవరికైనా శారీరకంగా అత్యంత శ్రమతో కూడుకున్న పని. కానీ, చంద్రబాబు శారీరక దృఢత్వం, క్రమశిక్షణతో కూడిన జీవనశైలి నేటి యువతరం రాజకీయ నేతలకు కూడా సవాలు విసిరేలా ఉన్నాయి. ఉదయం ఆరింటికే పర్యటనలు ప్రారంభించడం, ఎండనక, వాననక గంటల తరబడి జనంలో తిరగడం వెనుక ఆయన అసాధారణమైన విల్ పవర్ దాగి ఉంది. సాధారణ మనుషులకు ఊహకందని ఈ శక్తి, రాష్ట్ర భవిష్యత్తును మళ్లీ గాడిన పెట్టాలనే ఆయన తపన నుంచే పుట్టుకొచ్చిందని చెప్పవచ్చు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరిపాలనతో పోల్చి చూస్తే.. ఈ వ్యత్యాసం మరింత స్పష్టంగా, కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. గతంలో ముఖ్యమంత్రి పర్యటనలు అంటే పరదాలు, బారికేడ్లు, కట్టుదిట్టమైన ఆంక్షలు, ప్రజా నిరసనలకు తావులేని మూసివేసిన సభలు గుర్తుకొచ్చేవి. అవి కూడా అసాధారణమే.కానీ నేడు చంద్రబాబు పర్యటనల్లో సామాన్యుడికి సైతం ముఖ్యమంత్రిని నేరుగా కలిసే అవకాశం లభిస్తోంది. జనం మధ్యకు నడుచుకుంటూ వెళ్తూ, వారి కష్టాలను నేరుగా వింటూ, అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు ఇస్తున్న చంద్రబాబు శైలి ఏపీ రాజకీయాల్లో సరికొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసింది.

## జెత్వానీ కేసు... అధికారులకు ఓ లెసన్...

### అడ్డంగా దొరికిపోయిన అధికారులు

**విజయవాడ, జూలై 21, పెన్ పవర్:**
ముంబై నటి కాదంబరి జెత్వానీ ఉదంతంలో సీఐడీ దాఖలు చేసిన తాజా చార్జిషీట్ వ్యవహారం ఆంధ్రప్రదేశ్ రాజకీయ, అధికార వర్గాల్లో తీవ్ర సంచలనం రేపుతోంది. గతంలో సాంకేతిక లోపాలతో న్యాయస్థానం తిరస్కరించిన పాత చార్జిషీటును పక్కనబెట్టి, ఈసారి మరిన్ని పక్కా ఆధారాలతో సీఐడీ సరికొత్త చార్జిషీటును న్యాయస్థానం ముందు ఉంచింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత కుక్కల విద్యాసాగర్ ఇచ్చిన బ్లాక్‌మెయిల్ ఫిర్యాదు ఆధారంగానే ఈ చార్జిషీటు దాఖలైంది. జెత్వానీ తనను ఫొటోలతో బ్లాక్‌మెయిల్ చేసి దాదాపు రూ.1.32 కోట్ల మేర వసూలు చేసిందని విద్యాసాగర్ పోలీసులను ఆశ్రయించారు. అయితే, ఇక్కడ అసలు ట్విస్ట్ వారి మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలు కావు. ఒకవేళ ఆమె ట్రాప్ చేసిందా లేక విద్యాసాగరే ఆమెను లొంగదీసుకోవడానికి డబ్బులు ఇచ్చాడా అనేది వారిద్దరి వ్యక్తిగత వ్యవహారం. కానీ, ఈ కేసు ద్వారా బహిర్గతమైన అత్యంత భయంకరమైన నిజం ఏమిటంటే..అధికార పార్టీ నేత కోసం చట్టాన్ని రక్షించాల్సిన పోలీసు వ్యవస్థే ఒక మాఫియా లాగా మారిపోవడం! బాధిత నటి దగ్గర ఉన్న కీలకమైన డిజిటల్ ఆధారాలు, ఫోటోలు, చాటింగ్‌లను పూర్తిగా తుడిచిపెట్టేయడమే లక్ష్యంగా ఈ భారీ వ్యూహం పడినట్లు విచారణలో స్పష్టమవుతోంది. విద్యాసాగర్ తన ప్రైవేటు వ్యవహారాలు బయటపడకుండా కాపాడుకోవడం కోసం పోలీసు యంత్రాంగాన్ని ఒక ప్రైవేట్ సైన్యంలా వాడుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారుల స్థాయిలోనే ఇందుకు సంబంధించిన రహస్య తప్పిదాలు జరిగాయి. ఎటువంటి ముందస్తు నోటీసులు లేకుండా, కనీస నిబంధనలను బేఖాతరు చేస్తూ ముంబై వెళ్లిన ఏపీ పోలీసులు.. ఆమెను, ఆమె వృద్ధులైన తల్లిదండ్రులను కిడ్నాప్ తరహాలోనే అదుపులోకి తీసుకుని విజయవాడ తరలించారు. ఆపై రోజులకు రోజులు చట్టవిరుద్ధంగా నిర్బంధించి, తీవ్రంగా శారీరక, మానసిక హింసకు గురిచేశారనే ఆరోపణలు ఖాకీల వ్యవస్థీకృత తప్పిదాలను బట్టబయలు చేశాయి. ఒక ప్రైవేట్ వ్యక్తి ప్రయోజనాల కోసం, తప్పుడు ఫిర్యాదులను సాకుగా చూపిస్తూ ఒక మహిళ పట్ల పోలీసులు ప్రదర్శించిన ఈ క్రూరమైన అత్యుత్సాహాన్ని చట్టం ఏమాత్రం క్షమించలేదు. నిందితులు ఎంతటి నేరస్థులైనా సరే, వారిని విచారించడానికి రాజ్యాంగం కొన్ని పద్ధతులను, నిబంధనలను నిర్దేశించింది. కానీ, ఈ కేసులో మూడు దశాబ్దాల సుదీర్ఘ సర్వీసు ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారులు సైతం ఒక పొలిటికల్ బ్రోకర్ మాదిరి వ్యవహరించి వ్యవస్థను భ్రష్టు పట్టించారు. కేవలం విద్యాసాగర్ గుట్టు రట్టు కాకుండా చూసేందుకు, నటిని భయభ్రాంతులకు గురిచేసి కేసును క్లోజ్ చేయాలనుకున్న ప్లాన్ ఇప్పుడు సదరు అధికారుల మెడకే చుట్టుకుంది. తప్పుడు ఆర్డర్లను గుడ్డిగా పాటిస్తే కెరీర్‌తో పాటు జైలు పాలవ్వడం ఖాయమనే హెచ్చరికను ఈ జెత్వానీ కేసు తాజా చార్జిషీట్ బలంగా నిరూపిస్తోంది.తప్పు ఎవరి వైపు ఉంటే చట్టం వారిని శిక్షిస్తుంది!ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సీఐడీ సేకరించిన టెక్నికల్ లాగ్‌లు, ఫోన్ కాల్ డేటా, బ్యాంక్ బదిలీల రికార్డులు వంటి పక్కా సాక్ష్యాల వల్ల సస్పెండ్ అయిన ఐపీఎస్ అధికారులకు కోర్టుల నుంచి ఉపశమనం దక్కే అవకాశాలు దాదాపు లేవని న్యాయ నిపుణులు చెప్తున్నారు. వ్యక్తిగత సెటిల్‌మెంట్ల కోసం అధికార దుర్వినియోగానికి పాల్పడి, చట్టాన్ని బలిచేసిన ఈ పోలీసు మాఫియా తీరు భవిష్యత్తులో మిగిలిన అధికారులకు ఒక పెద్ద గుణపాఠం కానుంది.

## టీడీపీ, జనసేన నేతల మధ్య టగ్ ఆఫ్ వార్ తప్పదా?



**విజయవాడ, జూలై 21,పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయం ప్రస్తుతం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల చుట్టూ తిరుగుతోంది. సార్వత్రిక ఎన్నికల్లో చారిత్రాత్మక విజయంతో కూటమి పక్షాలైన తెలుగుదేశం, జనసేన, బీజేపీలు అధికారంలోకి వచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం రాబోయే స్థానిక పోరు సరికొత్త సమీకరణాలను తెరపైకి తెస్తోంది.ఈ ఎన్నికల్లో అధికార కూటమికి విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెద్దగా పోటీ ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అసలైన పోటీ, అంతర్గత ఘర్షణ అంతా కూటమి భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జనసేన మధ్యే కేంద్రీకృతమైంది. గ్రామీణ స్థాయి అధికారం, ఉనికి కోసం ఇరు పార్టీల ద్వితీయ శ్రేణి నాయకత్వం ఒకరితో ఒకరు తలపడటానికి సిద్ధమవుతుండటంతో, లోకల్ పోల్స్ కాస్తా కూటమి అంతర్గత బల ప్రదర్శనకు వేదికగా మారే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

**1. సీట్లపై ఏకాభిప్రాయం కష్టమే!**

ప్రధాన కారణం సీట్ల కేటాయింపులపై ఇరు పార్టీల అగ్రనేతల మధ్య వ్యూహాత్మక భిన్నాభిప్రాయాలు వ్యూహాత్మకంగా బయటకు రావడమే.

టీడీపీ భావన: గత అసెంబ్లీ ఎన్నికల నాటి సీట్ల పంపకాల ఫార్ములా (టీడీపీకి 85 శాతం, జనసేనకు 15 శాతం) బేస్ చేసుకుని స్థానిక సంస్థల్లోనూ ముందుకెళ్లాలని భావించింది.

జనసేన అభ్యంతరం: ఈ అసెంబ్లీ ఫార్ములా క్షేత్రస్థాయిలో అస్సలు పనిచేయదని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తేల్చేశారు. సార్వత్రిక ఎన్నికల నాటి త్యాగాలను ప్రతి ఊరిలోనూ పునరావృతం చేయలేమని, క్షేత్రస్థాయిలో తమకున్న బలాన్ని బట్టి తాము తగ్గేదే లేదంటూ జనసేన పట్టుబట్టడం కూటమి శ్రేణుల్లో ఒక్కసారిగా రాజకీయ వేడిని పుట్టించింది.

**2. క్యాడర్ బలాన్ని చాటుకునేందుకు లీడర్ల పట్టు**

ముఖ్యంగా ఉమ్మడి గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు, విశాఖపట్నం, రాయలసీమలోని కొన్ని కీలక నియోజకవర్గాల పరిధిలో ఈ కోల్డ్ వార్ తీవ్ర రూపం దాల్చుతోంది.

టీడీపీ కేడర్ వాదన: గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ వేధింపులను తట్టుకుని నిలబడిన స్థానిక టీడీపీ కేడర్.. "మేము ఎమ్మెల్యే సీటునే త్యాగం చేశాం, కనీసం మా ఊరి సర్పంచ్, ఎంపీటీసీ సీటు కూడా మాకు ఇవ్వకపోతే ఎలా?" అని గట్టిగా నిలదీస్తున్నారు.

జనసైనికుల డిమాండ్: కూటమి అధికారంలోకి రావడానికి తమ ఓట్లే ప్రధాన కారణమని, క్షేత్రస్థాయిలో తమ అభ్యర్థులకు మెజారిటీ స్థానాలు కేటాయించకపోతే ఊరుకునేది లేదని జనసేన ద్వితీయ శ్రేణి లీడర్లు భీష్మించుకు కూర్చున్నారు. పైస్థాయిలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మధ్య ఉన్న కెమిస్ట్రీ కిందిస్థాయి గడప దాటడం లేదనేది దీని ద్వారా స్పష్టమవుతోంది.

**3. పెరగనున్న తిరుగుబాటు అభ్యర్థుల ముప్పు**

ఈ రాజకీయం రాబోయే రోజుల్లో పలు ఆసక్తికరమైన మలుపులు తిరిగే అవకాశం ఉంది. ఎక్కడైతే అధికారికంగా సీటు దక్కదో, అక్కడ ఇరు పార్టీల ఆశావహులు రెబల్స్ అభ్యర్థులుగా బరిలోకి దిగడానికి సిద్ధమవుతున్నారు.పల్లెల్లో సర్పంచ్ స్థానం అనేది కేవలం ఒక పదవి మాత్రమే కాదు, అది గ్రామాల్లో ఒక నిర్దిష్ట సామాజిక వర్గానికి, కుటుంబానికి ఉండే ప్రతిష్టకు సంబంధించిన అంశం. అందువల్ల అగ్రనాయకత్వం ఎంత ఒత్తిడి తెచ్చినా కిందిస్థాయి లీడర్లు వెనక్కి తగ్గే పరిస్థితి కనిపించడం లేదు. ఈ అంతర్గత ఓట్ల చీలిక కొన్నిచోట్ల స్వతంత్రులకు లేదా తెరవెనుక పొంచి ఉన్న విపక్ష వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు అనూహ్యంగా లాభం చేకూర్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

**పరిష్కార మార్గాలు: సమన్వయం సాధించడం ఎలా?**

పైస్థాయి నాయకత్వం మధ్య ఉన్న సమన్వయం కింద కూడా లేకపోతే వచ్చే ఈ తీవ్రమైన సమస్యలను పరిష్కరించుకోవడానికి కూటమి అధిష్టానం సరికొత్త అస్త్రాలను ప్రయోగించాల్సి ఉంటుంది.

ఉమ్మడి కో–ఆర్డినేషన్ కమిటీలు: కేవలం నోటి మాటలతో కాకుండా, జిల్లాల వారీగా, నియోజకవర్గాల వారీగా ఇరు పార్టీల కీలక నేతలతో కమిటీలను ఏర్పాటు చేయాలి.

ఫ్రెండ్లీ కాంటెస్ట్ : ఎక్కడైతే ఇరు పార్టీలు బలంగా ఉన్నాయో, అక్కడ ఏకాభిప్రాయం కుదరకపోతే.. ఆయా గ్రామాల్లో స్నేహపూర్వక పోటీకి అనుమతించడం.

సీట్ల సమతుల్యత: ఒక పార్టీకి సర్పంచ్ స్థానం ఇస్తే, మరో పార్టీకి ఎంపీటీసీ ఇచ్చేలా సమతుల్యత పాటించడం ఏకైక మార్గంగా కనిపిస్తోంది.

మొత్తానికి ఈ స్థానిక సంస్థల ఎన్నికలు కూటమి ప్రభుత్వ ప్రజాదరణకు మాత్రమే కాదు, వారి అంతర్గత బంధానికి కూడా ఒక పెద్ద అగ్నిపరీక్ష. పైస్థాయిలో ఉన్న దోస్తీని క్షేత్రస్థాయి సమన్వయం ద్వారా పల్లెల్లోకి తీసుకెళ్లడంలో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ఎంతవరకు సఫలమవుతారనే దానిపైనే కూటమి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. తమ సొంత అహంకారాలు, ఈర్ష్యాద్వేషాల వల్ల పొత్తుల రొంపిలో తమ్ముళ్లు, సైనికులు కొట్టుకోకుండా చూసుకోవడమే ప్రస్తుతం కూటమి ముందున్న అసలైన టాస్క్.
=

## 20 జిల్లాల్లో డేంజర్ బెల్స్...

**కర్నూలు జూలై 21 పెన్ పవర్:**
ఏపీలో తీవ్ర వర్షాభావం నెలకొంది. కనీస స్థాయిలో కూడా వర్షాలు పడడం లేదు. ఆకాశం మేఘావృతం అవుతుందే తప్ప వరుణుడు మాత్రం దోబూచులాడుతున్నాడు. దీంతో ఏపీలో లోటు వర్షపాతం 35 శాతానికి పెరిగింది. మొత్తం 28 జిల్లాలకు గాను.. దాదాపు 20 జిల్లాల్లో అత్యల్ప వర్షపాతం నమోదైనట్లు భారత వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. జూన్ 1 నుంచి జూలై 17 మధ్య సాధారణ వర్షపాతం 162.6 మిల్లీమీటర్లు కాగా.. రాష్ట్రంలో 106.3ఎ వర్షపాతం మాత్రమే నమోదు అయినట్లు భారత వాతావరణ శాఖ చెబుతోంది.కోస్తాంధ్ర ప్రాంతానికి సంబంధించి గుంటూరు, పల్నాడు, విజయనగరం జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయింది.రాయలసీమకు సంబంధించి అనంతపురం, శ్రీ సత్య సాయి జిల్లాలో కూడా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయింది. అయితే ఈ జిల్లాలను మినహాయించి మిగతా జిల్లాల్లో అయితే భారీ లోటు వర్షపాతం నమోదు అయింది.పశ్చిమగోదావరి, అన్నమయ్య, యానం జిల్లాల్లో 60 శాతం లోటు వర్షపాతం నమోదు అయింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 50% కంటే ఎక్కువ లోటు నమోదయింది. తిరుపతి, కడప, బాపట్ల, తూర్పుగోదావరి, పార్వతీపురం మన్యం, ప్రకాశం జిల్లాల్లో 40% కంటే ఎక్కువ వర్షపాతం లోటు నమోదయింది. ఒక్క అనంతపురం జిల్లాలో మాత్రమే సాధారణ స్థాయికి సమానమైన 95.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.జూన్ 1 నుంచి జూలై 17 వరకు సాధారణ వర్షపాతం ఏపీలో 192.7 ఎ కాగా.. 35 శాతం లోటుతో 126 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.
రాయలసీమకు సంబంధించి సాధారణంగా కురవాల్సిన 119.9 మిల్లీమీటర్ల వర్షపాతానికి బదులు.. 83.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

# రోహిత్ మాటలు అప్పట్లో నమ్మలేదు.. ప్రపంచకప్‌లో అదే నన్ను మార్చింది: సంజూ శాంసన్

- టీ20 ప్రపంచకప్ జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న సంజూ
- ఆరంభ మ్యాచుల్లో ఎంపిక చేయకపోవడంతో నిరాశకు గురైనట్లు వెల్లడి
- రోహిత్ ధైర్యం చెప్పినా నమ్మలేకపోయానన్న శాంసన్
- క్రికెట్ ఎందుకు ఆడుతున్నానో తనను తాను ప్రశ్నించుకున్నట్లు వెల్లడి
- అదే తనలో ఆత్మవిశ్వాసాన్ని నింపిందన్న సంజూ
- న్యూజిలాండ్ సిరీస్ పెద్ద గుణపాఠం నేర్పిందని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్-2026లో తొలుత తుది జట్టులో చోటు దక్కకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యానని భారత వికెట్‌కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ వెల్లడించాడు. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో విఫలమైన తర్వాత ఇషాన్ కిషన్ అద్భుతంగా రాణించడంతో తన ప్రపంచకప్ అవకాశాలు ముగిసిపోయాయని భావించినట్లు చెప్పాడు. ఆ సమయంలో రోహిత్ శర్మ ధైర్యం చెప్పినా తాను ఆ మాటలను నమ్మలేకపోయానని జియోస్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపాడు.ప్రపంచకప్ ప్రారంభమైన తొలి నాలుగు, ఐదు రోజులు ఆ నిరాశ నుంచి బయటపడలేకపోయానని సంజూ చెప్పాడు. ఆ తర్వాత తన ఆలోచనా విధానాన్ని మార్చుకుని.. అసలు తాను క్రికెట్ ఎందుకు ఆడుతున్నానో తనను తాను ప్రశ్నించుకున్నానని వివరించాడు. అదే తనలో మళ్లీ ఆత్మవిశ్వాసాన్ని నింపిందని, మానసికంగా బలంగా మారేందుకు దోహదపడిందని పేర్కొన్నాడు.
వెస్టిండీస్‌తో జరిగిన కీలక మ్యాచ్‌కు ముందు మరింత మెరుగ్గా సిద్ధమయ్యానని సంజూ తెలిపాడు. ఆ మ్యాచ్‌లో ప్రతి షాట్ సహజంగానే వచ్చిందని, అది తన కెరీర్‌లో ప్రత్యేకమైన ఇన్నింగ్స్‌గా నిలిచిపోతుందని అన్నాడు. వికెట్లు పడుతుండటంతో సాధారణ ఆటతీరును మార్చుకుని పరిస్థితులకు అనుగుణంగా బ్యాటింగ్ చేశానని వివరించాడు.ఇక న్యూజిలాండ్ సిరీస్ తనకు పెద్ద గుణపాఠం నేర్పిందని సంజూ చెప్పాడు. ఎక్కువసేపు ప్రాక్టీస్ చేయడం కంటే మానసికంగా ప్రశాంతంగా ఉండటమే ముఖ్యమని తన భార్య చెప్పిన మాటలు అప్పుడే అర్థమయ్యాయని పేర్కొన్నాడు. తాను సాధించిన విజయాల్లో దేవుడి ఆశీర్వాదమే ఎక్కువని, ఆ ప్రపంచకప్ ఇన్నింగ్స్ జీవితాంతం గుర్తుండిపోతుందని సంజూ భావోద్వేగంగా చెప్పుకొచ్చాడు.

# గంభీర్ కూడా బాధ్యత తీసుకోవాల్సిందే.. టీమిండియా ఓటమిపై మాజీ కెప్టెన్ ఫైర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ ఓటమి తర్వాత టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, జట్టు యాజమాన్యంపై మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్ తీవ్ర విమర్శలు చేశారు. వరుసగా జట్టులో మార్పులు చేయడం, సరైన ప్రణాళిక లేకపోవడం వల్లే ఇలాంటి ఫలితాలు వస్తున్నాయని అన్నారు. 2027 ప్రపంచకప్‌కు ఇలాగే సిద్ధమైతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు.
ఇంగ్లండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను భారత్ 2-1తో కోల్పోయిన విషయం తెలిసిందే. దీనిపై తాజాగా శ్రీకాంత్ తన యూట్యూబ్ ఛానల్‌లో స్పందించారు. జింబాబ్వే, శ్రీలంక, వెస్టిండీస్‌లాంటి జట్లపై విజయాలు సాధిస్తేనే భారత జట్టు మళ్లీ ఫామ్‌లోకి వచ్చిందని చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. బలమైన జట్లపై గెలిచినప్పుడే అసలు ప్రమాణం తెలుస్తుందని పేర్కొన్నారు. టీమ్ మేనేజ్‌మెంట్‌తో పాటు గంభీర్ కూడా ఈ ఫలితాలకు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. వన్డే ప్రపంచకప్‌కు ముందు చాలా తక్కువ మ్యాచ్‌లు మాత్రమే ఉండటంతో ఇప్పుడైనా స్థిరమైన జట్టును తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు.లార్డ్స్ వన్డేలో బ్యాటింగ్ ఆర్డర్‌పైనా శ్రీకాంత్ అసంతృప్తి వ్యక్తం చేశారు. భారీ లక్ష్యాన్ని ఛేదించే సమయంలో కేఎల్ రాహుల్‌ను ఆరో స్థానంలో పంపడం అర్థంలేని నిర్ణయమన్నారు. రోహిత్ శర్మ ఔటైన వెంటనే విరాట్ కోహ్లీకి తోడుగా రాహుల్‌ను పంపాల్సిందని అభిప్రాయపడ్డారు. 2023 ప్రపంచకప్‌లో కోహ్లీతో కలిసి రాహుల్ కీలక ఇన్నింగ్స్‌లు ఆడిన విషయాన్ని గుర్తు చేశారు. మ్యాచ్ దాదాపు చేజారిపోయిన తర్వాత అతణ్ని క్రీజులోకి పంపడం వల్ల ప్రయోజనం ఏముంటుందని ప్రశ్నించారు.

# రోహిత్, కోహ్లీలను జట్టు నుంచి తీయడం అసాధ్యం: అశ్విన్



- రోహిత్, కోహ్లీలను జట్టు నుంచి తొలగించడం దాదాపు అసాధ్యమన్న అశ్విన్
- వారి అద్భుతమైన రికార్డులు, అభిమానుల మద్దతే ఇందుకు కారణమని వెల్లడి
- బ్యాటర్లతో పోలిస్తే బౌలర్లను తొలగించడం సులభమని వ్యాఖ్య
- భవిష్యత్తులో బౌలర్లకు కూడా అలాంటి మద్దతు లభించాలని ఆకాంక్ష

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత జట్టులోని సీనియర్ స్టార్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలను జట్టు నుంచి తొలగించడం దాదాపు అసాధ్యమని టీమిండియా వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు. వారి అద్భుతమైన ట్రాక్ రికార్డులు, అపారమైన అభిమాన గణమే ఇందుకు ప్రధాన కారణాలని ఆయన విశ్లేషించాడు.తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా అశ్విన్ ఈ వ్యాఖ్యలు చేశాడు. ఈ ఇద్దరు సీనియర్ ఆటగాళ్ల భవిష్యత్తుపై జరుగుతున్న చర్చపై ఆయన స్పందిస్తూ.. వన్డే ఫార్మాట్‌లో కొనసాగాలని రోహిత్, కోహ్లీ భావిస్తే, వారిని జట్టు నుంచి తప్పించడం అటు మేనేజ్‌మెంట్‌కు గానీ, ఇటు సెలెక్టర్లకు గానీ అంత సులభం కాదని పేర్కొన్నారు. లార్డ్స్ వేదికగా జరిగిన చివరి వన్డేలో రోహిత్ అజేయ సెంచరీతో (138) విమర్శలకు దీటైన సమాధానమిచ్చారని ఈ సందర్భంగా గుర్తుచేశాడు."ముందుగా వారికున్న అద్భుతమైన ట్రాక్ రికార్డును గమనించాలి. రోహిత్ వన్డేల్లో దాదాపు 12,000 పరుగులు సాధించారు. రెండోది, వారిద్దరూ అగ్రశ్రేణి స్టార్ బ్యాటర్లు. వారి ఆటను వీక్షించేందుకే లక్షలాది మంది అభిమానులు స్టేడియాలకు తరలివస్తారు. అటువంటి ఆటగాళ్లను జట్టు నుంచి తొలగిస్తే తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వస్తుంది," అని అశ్విన్ వివరించాడు.
అయితే, బ్యాటర్ల విషయంలో ఉన్న ఈ సానుకూల పరిస్థితి బౌలర్లకు ఉండదని అశ్విన్ పేర్కొన్నాడు. మహమ్మద్ షమీ, మహమ్మద్ సిరాజ్ వంటి స్టార్ బౌలర్లను జట్టు నుంచి తప్పించినప్పుడు, బ్యాటర్ల విషయంలో వచ్చినంతగా ప్రజా వ్యతిరేకత రాదని ఆయన అభిప్రాయపడ్డాడు. భవిష్యత్తులో బౌలర్లకు కూడా ఇదే స్థాయి అభిమాన మద్దతు లభించాలని, వారి ఎంపిక కూడా సెలెక్టర్లకు కష్టతరంగా మారాలని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపాడు.

# స్పిరిట్ క్రేజీ అప్ డేట్ ఏంటంటే?

రెబా మోనికా జాన్ యొక్క ఫ్యాషన్ అలలు సృష్టిస్తోంది






పాన్-ఇండియా స్టార్ ప్రభాస్ - సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా -స్పిరిట్- తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమాపై అంచనాలు ఏ రేంజ్ లో ఉన్నాయో? చెప్పాల్సిన పనిలేదు. దీంతో సినిమా ఎప్పుడెప్పుడు? ప్రేక్షకుల ముందుకొస్తుందని ఆసక్తి అంతకంతకు పెరిగిపోతుంది.ఈ నేపథ్యంలో తాజాగా ఈ చిత్రం గురించి ఓ క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ 40 శాతం పూర్తయిందని సందీప్ రెడ్డి వంగా వెల్లడించారు. ఈ సినిమా షూటింగ్ ప్రక్రియ ఇప్పటికే వేగంగా కొనసాగుతోందని.. సినిమాలోని కీలకమైన సన్నివేశాలను, యాక్షన్ ఘట్టాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా చిత్రీకరిస్తున్నట్లు తెలిపారు. 40 శాతం షూటింగ్ పూర్తి కావడం అంటే? నిర్మాణ బృందం పక్కా ప్రణాళికతో ముందడుగు వేస్తోందనడానికి నిదర్శనం. ప్రభాస్ లుక్ ..క్యారెక్టరైజేషన్ విషయంలో సందీప్ తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ చిత్రంలో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతున్నారని రోజులుగా ప్రచారం జరుగుతోంది. సాధారణంగా సందీప్ సినిమాల్లో హీరోల పాత్రలు చాలా ఇంటెన్స్‌గా, ఎమోషనల్‌గా ఉంటాయి. ప్రభాస్ వంటి మాస్ ఇమేజ్ ఉన్న నటుడు ఎలాంటి పాత్రలో ఎలా కనిపించబోతున్నాడనేది ఫ్యాన్స్‌లో ఆసక్తిని కలిగిస్తోంది.
ఇప్పటికే పూర్తయిన 40 శాతం షూటింగ్‌లో ప్రభాస్ నటించిన సీన్లు చాలా పవర్‌ఫుల్‌గా వచ్చాయని చిత్ర వర్గాల నుంచి వినిపిస్తున్న మాట. సాంకేతికపరంగా స్పిరిట్ హాలీవుడ్ స్థాయి ప్రమాణాలతో రూపొందుతోందని తెలుస్తోంది. భారీ సెట్లు, అత్యాధునిక కెమెరా పనితనం , నేపథ్య సంగీతం సినిమాకు ప్రధాన బలంగా నిలవనున్నాయి. సందీప్ రెడ్డి వంగా ప్రతి సినిమాకు సంగీత దర్శకులతో ప్రత్యేకమైన శబ్దాలను రూపొందిస్తారు. ఈ చిత్రానికి కూడా ఆయన మ్యూజిక్ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. మిగిలిన భాగం షూటింగ్ కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు చిత్ర బృందం సిద్ధమైంది. అయితే ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైన నాటి నుంచి ఇండియాలోనే వివిధ లోకేషన్లలో జరుగుతోంది.విదేశీ లోకేషన్ల వరకూ వెళ్లలేదు. ఈ నేపథ్యంలో 60 శాతం షూటింగ్ లో కొంత భాగం విదేశాల్లో జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. సాధారణంగా సందీప్ విదేశీ షూటింగ్ లకు పెద్దగా ప్రాధాన్యతనివ్వరు. వీలైనంత వరకూ ఇండియాలోనే చుట్టేస్తారు. -అర్జున్ రెడ్డి-, -యానిమల్- షూటింగ్ లు ఇండియాలోనే జరిగాయి. వాటిలో పాటలకు కూడా పెద్దగా ప్రాధాన్యత లేదు కాబట్టి విదేశీ లోకేషన్ల అవసరం పడలేదు. మరి -స్పిరిట్- విషయంలో విదేశీ లోకేషన్ల ఛాన్స్ ఎంత వరకూ తీసుకుంటారు? అన్నది తేలాల్సి ఉంది.

సుప్రీత వార్డ్‌రోబ్ మీకు కావాల్సినవన్నీ



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D. No. 41-1/5-1, Srinivasa Tower, Flat No. S2, Gowthami Nagar, Krishnalanka, Vijayawada, NTR Dist. editor GANTYADA APPARAO. PRGI Registration No. " APTEL/25/A4561" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965